PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 191 | విజయవాడ, ఆదివారం 12 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 12 February 2023 | Rs

రాజ్యాంగ లక్ష్యాల సాధనకు కృషి
- ఇది పౌరులందరి బాధ్యత
- మహారాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో జస్టిస్ చంద్రచూడ్

లోపలి పేజీలో..



మూడు రోజుల్లోనే ముగించేశారు
- స్పిన్నర్ల దెబ్బకు ఆసీస్ కుదేల్

స్పోర్ట్స్ పేజీలో

మద్యం కుంభకోణం కేసులో మాగుంట రాఘవ అరెస్ట్

పది రోజుల ఇడి కస్టడికి కోర్టు ఆదేశం



మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డిని తరలిస్తున్న ఇడి అధికారులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు మాగుంట రాఘవ రెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) అరెస్ట్ చేసింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూలో సిబిఐ ప్రత్యేక కోర్టులోని న్యాయమూర్తి జస్టిస్ నరేష్ కుమార్ లాకా ధర్మాసనం ముందు శనివారం ఇడి అధికారులు హాజరు పర్చారు. విచారణ కోసం పదిరోజులు ఇడి కస్టడికి ఇవ్వాలన్న అభ్యర్థించారు. దీనిని రాఘవరెడ్డి తరపు లాయర్లు వ్యతిరేకించారు. విచారణ తరువాత పది రోజులు ఇడి కస్టడికి ధర్మాసనం అనుమతించింది. తదుపరి విచారణను 21వ తేదికి వాయిదా వేసింది. అదే సమయంలో ప్రతిరోజు గంట పాటు రాఘవ రెడ్డిని కలుసుకునేందుకు కుటుంబ సభ్యులు అవకాశం కల్పించింది. అయితే ఇంటి నుంచి భోజనం తీసుకునేందుకు నిరాకరించింది. అంతకుమందు ఇడి తరపు న్యాయవాది ఎన్‌కె మట్ట సౌత్ గ్రూప్‌లో రాఘవరెడ్డి కూడా కీలకమని చెప్పారు. రూ. వంద కోట్ల ముడుపుల్లో కీలకంగా వ్యవహరించారన్నారు. ఈ కేసులో ఇప్పటికే శరత్ చంద్రారెడ్డి, విజయ నాయర్, అభిషేక్, సమీర్, అమిత్ అరోరా, బినోయ్ అరెస్టు అయ్యారని పేర్కొన్నారు. శరత్ చంద్రారెడ్డితో రాఘవ రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. . మద్యం విధానంతో లబ్ధి పొందేందుకు ముడుపులు ఇచ్చారని, ఈ ముడుపులను హవాలా మార్గంలో చెల్లించారని కోర్టుకు వివరించారు. ఇప్పటికే దాఖలు చేసిన ఛార్జిషీట్లలో వివరాలు పొందుపరిచామని కోర్టుకు తెలిపారు. సుమారు 30 మంది సాక్షుల వాంగ్మూలం కూడా నమోదు చేశామని వివరించారు. ఇంకా రూ.30 కోట్లకు సంబంధించిన వివరాలు తీసుకోవాల్సి ఉందని న్యాయ స్థానానికి తెలిపారు.

ఇడికి అరెస్టు చేసే అధికారం లేదు: రాఘవ తరపు న్యాయవాది

రాఘవను జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాలి తప్ప ఇడి కస్టడీకి కాదని రాఘవ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. రాఘవ చెప్పాల్సింది చెప్పారని, మళ్ళీ ఇడికి కావాల్సినట్టు చెప్పించు కోవడానికి కస్టడీ కోరుతుందని అన్నారు. ఈడి ఏర్పడిన ప్రత్యేక చట్ట ప్రకారం అరెస్టుకు ముందస్తు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అరెస్టు చేస్తూ కనీసం దాఖలు చేసిన అప్లికేషన్ ఇవ్వలేదని, రిమాండ్ అప్లికేషన్ కూడా ఇవ్వలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, దీనిపై అభ్యంతరం తెలిపిన ఈడి తరపు న్యాయవాది అరెస్టు చేస్తున్నట్లు నిందితుడికి ముందుగానే చెప్పినట్లు పేర్కొన్నారు. నిందితుడి సంతకాలు తీసుకున్న తర్వాతే.. కస్టడీలోకి తీసుకున్నట్లు వివరించారు.

బుచ్చిబాబుకు జ్యుడీషియల్ కస్టడి

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాజీ ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబుకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీని సిబిఐ కోర్టు విధించింది. ఈనెల 25 వరకు జ్యుడీషియల్ డిమాండ్ ను విధించింది. బుచ్చిబాబు మద్యం విధానం కుట్రలో భాగస్వామి అని, సహ నిందితులతో కలిసి అనేక సమావేశాల్లో పాల్గొన్నారని సిబిఐ తెలిపింది. చాలా తీవ్రమైన నేరానికి పాల్పడ్డారని, జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని కోరింది. బుచ్చిబాబు తరపు న్యాయవాది తాము బెయిల్ కోసం దరఖాస్తు చేయడం లేదని, మందులు ఇచ్చేందుకు అనుమతి ఇవ్వండని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదం

- ఎస్ఎంఎస్-2లో భారీ పేలుడు • 9 మందికి తీవ్రగాయాలు • నలుగురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం), ఎంవిపి.కాలనీ

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-2 విభాగంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తొమ్మిది మంది ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రగాయాలపాలయ్యాయి. స్టీల్ మెటల్ స్లాగ్‌ను తరలిస్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. స్టీల్ ప్లాంట్ అధికారుల కథనం ప్రకారం... స్లాగ్‌ను తరలించే క్రమంలో లాడెల్ కదలకుండా ఇరుక్కుపోయింది. మెటల్‌ను చల్లబరిచేందుకు అప్పటికే చుట్టూ నీటిని చల్లారు. ఇరుక్కుపోయిన లాడెల్‌ను కదిలించేందుకు జెసిబితో నెట్టేందుకు ప్రయత్నించిన క్రమంలో స్లాగ్ నీటిపై పడి పేలుడు సంభవించింది. దీంతో, కంట్రోల్ రూమ్ బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు సైతం పగిలిపోయాయి. ప్రమాదంలో ఇద్దరు అధికారులు, ఇద్దరు టెక్నీషియన్లతోపాటు ఐదుగురు కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని ప్రథమ చికిత్స అనంతరం స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం నగరంలోని సెవెన్ హిల్స్‌కు వైద్యుల సూచనల మేరకు తీసుకెళ్లారు. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న కార్మిక సంఘాల నేతలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు.



పేలుడు సంభవించిన ప్రాంతమిదే.. (ఇన్‌సెట్‌లో) క్షతగాత్రున్ని పరామర్శిస్తున్న కార్మిక నేతలు సిహెచ్.నర్సింగరావు, జెవి.సత్యనారాయణమూర్తి

గాయపడినవారు వీరే..

ఈ ప్రమాదంలో డిజిఎం అనిల్ పహివాల, సీనియర్ మేనేజర్ జయకుమార్, టెక్నీషియన్ ఈశ్వర్ నాయక్, ఛార్జ్‌మ్యాన్ పాండా సాహూ, కాంట్రాక్టు కార్మికులు బంగారయ్య, సూరిబాబు, అప్పలరాజు, శ్రీను, పోతయ్య గాయపడ్డారు. అనిల్ పహివాల, జయకుమార్, శ్రీను, పోతయ్య పరిస్థితి విషమంగా ఉంది. 24 గంటలు గడిస్తేగానీ ఏ విషయమూ చెప్పలేమని వైద్యులు తెలిపారు.

పలువురి పరామర్శ

క్షతగాత్రులను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి సీనియర్ నాయకులు జెవి.సత్యనారాయణమూర్తి, స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్ తదితరులు పరామర్శించారు. బాధితులకు న్యాయం చేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

కొరవడిన భద్రతా చర్యలు : స్టీల్ సిఐటియు

అనుభవంలేని కొంతమంది మిగతా 2లో



మొదటి స్థానంలో నిలిచిన జా ఎరిక్ వా

ముగిసిన ఫార్ములా ఇ- కార్ రేస్
- మొదటి స్థానంలో జా ఎరిక్ వా

నియంత్రణ సంస్థలు చూసుకుంటాయి!
- అదాని వ్యవహారంపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్
- ఆర్‌బిఐ బోర్డుతో భేటీ

లోపలి పేజీలో..

భోగాపురంలో ఉద్రిక్తత

- ఎయిర్‌పోర్టు నిర్వాసిత గ్రామాల్లో ఇళ్లు కూల్చివేత
- ఆర్‌డిఒను నిలదీసిన నిర్వాసితులు, టిడిపి నాయకులు



కూల్చివేసిన పాఠశాల

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా), అమరావతి బ్యూరో

విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసిత గ్రామాల్లో ఇళ్ల కూల్చివేతలో శనివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిర్వాసిత గ్రామాలైన బొల్లింకలపాలెం, ముడసర్లపేట, రెల్లిపేటలో గత వారం రోజులుగా ఇళ్లను కూల్చివేయగా, మరడపాలెంలో శుక్రవారం నుంచి ఇళ్ల కూల్చివేత ప్రారంభించారు. ఇప్పటివరకూ గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతోపాటు ఏడుగురి నిర్వాసితుల ఇళ్లను కూల్చివేశారు. ఈ నేపథ్యంలో 'ఎయిర్‌పోర్టు కోసం త్యాగం చేసి భూములు ఇచ్చాం. ఆస్తుల్ని వదులుకున్నాం. సర్వం కోల్పోయాం. ఏళ్లగా జీవనం సాగిస్తున్న గ్రామాలతో అనుబంధం తెంచేస్తున్నారు. అయినా, కొంచెం సమయం ఇస్తే గ్రామాలను ఖాళీ చేస్తామని చెబుతున్నా కనికరం చూపరా?' అంటూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు ఖాళీ చేసేందుకు సమయం ఇవ్వాలంటూ అధికారులను వేడుకున్నారు. అయినా, ఆర్‌డిఒ సూర్యకళ ఆధ్వర్యాన అధికారులు అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలతోపాటు విఆర్‌ఒ, అంగన్‌వాడీ కార్యకర్త ఇళ్లను కూల్చి వేశారు. ప్రభుత్వోద్యోగులం కావడంతో ఎదిరించలేక అంగీకరించాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన బెనిఫిట్స్, నిర్వాసిత కాలనీల్లో సదుపాయాలు కల్పించిన తర్వాతే గ్రామాలను ఖాళీ చేస్తామని కొందరు నిర్వాసితులు తెలిపారు. అన్ని విధాలా సాయమిచ్చేశామంటూ, ఇంకేం లేమంటూ గ్రామస్థులను రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పారు. నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి ఎల్లాజి, పలువురు టిడిపి నాయకులు అక్కడికి చేరుకొని నిర్వాసితులకు మద్దతుగా నిలిచారు. ఆర్‌డిఒతో మాట్లాడారు. నిర్వాసితులకు మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాత ఖాళీ చేయించాలి తప్ప, అర్థాంతరంగా ఊరి నుండి వెళ్లిపోమంటే ఎలా అని బంగార్రాజు ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో నిర్వాసితుల కాలనీలో పనులు జరగలేదని మిగతా 2లో

సుబ్బన్న ఫ్యాక్టరీ యాజమాన్యం అరెస్ట్

ప్రజాశక్తి-పెద్దాపురం (కాకినాడ)

నిర్లక్ష్యంగా వ్యవహరించి ఏడుగురి ప్రాణాలు బలిగొన్న అంబటి సుబ్బన్న అండ్ కంపెనీ సూపర్‌వైజర్‌తోపాటు కంపెనీ యజమానులను అరెస్టు చేసినట్టు పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళీమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలో ఈ నెల 9న జరిగిన ప్రమాదంలో ఏడుగురు చనిపోయిన ఘటనపై పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు విచారణలో వెలుగు చూసిన అంశాలు, జాయింట్ కలెక్టర్ విచారణ నివేదికను బట్టి ఈ కేసులో సెక్షన్ 304-ఎ, ఐపిసి 304-3 (2) (వి) ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి సెక్షన్లను నమోదు చేసినట్టు డిఎస్‌పి తెలిపారు. ఫ్యాక్టరీ సూపర్‌వైజర్ అక్కిరెడ్డి శ్రీనివాస్, కంపెనీ నడుపుతున్న సింగవరపు విశ్వనాథ్, సింగవరపు రఘురామ్‌ను అరెస్టు చేశామని, వారిని పెద్దాపురం మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరుస్తామని వెల్లడించారు.

ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని తొలగించాలి

ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి : వామపక్షాలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్, కడప అర్బన్

అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం విద్యాశాఖ అధికారులను బెదిరిస్తోన్న రాయలసీమ జోన్ ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని తొలగించాలని, ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు జాబితాలో అనర్హులకు ఓటు హక్కు కల్పించిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి డిమాండ్ చేశారు. తిరుపతిలోని యశోదానగర్‌గల సిపిఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతిలో 231 గ్రాడ్యుయేట్ పోలింగ్ కేంద్రం ఓటర్ల జాబితాలో ఒకే వ్యక్తి పేరు 30 సార్లు ఉందని, విద్యార్హతలేని వారికీ అధికారులు ఓటు హక్కును కల్పించారని తెలిపారు. దాదాపు రెండు వేల ఓట్ల వరకు డబుల్ ఎంట్రీలు ఓటర్ల జాబితాలో ఉన్నాయని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే ఓటు హక్కును ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. ఓటర్ జాబితాలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు గ్రామ/వార్డు వలంటీర్ వ్యవస్థ జోక్యం లేకుండా ఎన్నికల కమిషన్ చూడాలని విజ్ఞప్తి చేశారు. అవకతవకలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం నాయకులు కందారపు మురళి, టి సుబ్రమణ్యం, సిపిఐ నాయకులు జె.విశ్వనాథ్, ఎ.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ప్రలోభాల పర్వం

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ స్థానం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం.వి.రామచంద్రారెడ్డి ప్రలోభాల పర్వం కొనసాగుతోంది. అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల్లో ఓటర్లకు గిఫ్ట్ బాక్కుల పంపిణీకి శుక్రవారం చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టినా శనివారం కూడా తన ప్రయత్నం కొనసాగించారు. ఓటర్లకు పంపిణీ చేయడానికి కడప శివారులోగల రామరాజుపల్లెలోని నాగార్జున మోడల్ స్కూల్లో గిఫ్ట్ బాక్సులను ఉంచారు. అక్కడి నుంచి ఈ బాక్స్‌లను ఆటోల్లో నగరంలోని పాఠశాలలకు తరలిస్తుండగా ఈ విషయం తెలుసుకొని సిపిఐ వైసిఆర్ జిల్లా కార్యదర్శి వెంకటశివ ఆధ్వర్యాన సిపిఐ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసులకు, మీడియాకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు, గిఫ్ట్ బాక్సులను ఉంచిన గది ముందు బైఠాయించి ధర్నా చేశారు. వెంటనే ఈ గదిని సీజ్ చేయాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని అరెస్టు చేయాలని, స్కూల్ గుర్తింపు రద్దు చేసి యాజమాన్యాన్ని మిగతా 2లో

కానిస్టేబుల్ అభ్యర్థుల నిరసనతో ఉద్రిక్తత

- పలువురి అరెస్ట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాత పరీక్ష ఫలితాలకు కనీసం ఐదు మార్కులు కలపాలని డిమాండ్ చేస్తూ కానిస్టేబుల్ అభ్యర్థులు శనివారం నిర్వహించిన సిఎం ఇంటి ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఎం కార్యాలయానికి దారితీసే అన్ని దారులను మూసివేశారు. అటువైపుగా వెళ్లే సిటీ బస్సులనూ అనుమతించలేదు. కానిస్టేబుల్ అభ్యర్థులతో పాటు, అనుమానం వచ్చిన పలువురిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో అటు విజయవాడ, గుంటూరుల నుండి తాడేపల్లి పరిసర ప్రాంతాలకు వచ్చే సాధారణ ప్రజానీకం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల నుండి సుమారు 400 మంది అభ్యర్థులు విజయవాడకు వేర్వేరు మార్గాల్లో చేరుకున్నారు. వీరిలో పలువురు తాడేపల్లిలోని టోల్‌గేట్ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు వారిని తనిఖీలు చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తాడేపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టుల సమయంలో అభ్యర్థులు తమ జీవితాలను కాపాడాలని, పరీక్ష పేపరు గ్రూప్-1 అభ్యర్థులకు ఇచ్చే రీతిలో ఉందని, సామాన్య కానిస్టేబుల్‌కు ఇచ్చే రీతిలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తామేమి దౌర్జన్యానికి రాలేదని, తమ బాధను సిఎంకు చెప్పుకునేందుకు వచ్చామని అన్నారు. . మరికొందరు విద్యార్థుల్లా నోట్ పుస్తకాలు తీసుకుని అక్కడకు రావడంతో పోలీసులు వారిని చుట్టుముట్టారు. బ్యాగులు తనిఖీ చేయించారు. అదుపులోకి తీసుకున్న వారిని సాయంత్రం వరకూ ఉంచి సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. పలువురు కానిస్టేబుల్ అభ్యర్థులు మట్లాడుతూ సంవత్సరాల తరబడి తాము పోలీసు అభ్యర్థులుగా పరీక్షలు రాసేందుకు కష్టపడుతున్నామని తెలిపారు. ఎక్కువమందికి ఇప్పుడు అవకాశం రాకపోతే వయస్సు దాటిపోతుందని మరోసారి అవకాశం ఉండదని తెలిపారు. పోలీసు రిక్రూట్‌మెంటు సమయం ఎక్కువ ఉంటోందని, దానివల్ల ఇక ముందు పరీక్షలు రాసే అవకాశం కోల్పోతామని తెలిపారు. పరీక్ష పేపరు కూడా అత్యంత కఠినంగా ఇచ్చారని, పరీక్షల పేపర్లనూ సంబంధం లేదని అంశాలను ప్రస్తావించారని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య బలోపేతానికి చర్చలు
- అమెరికాలో లూలా పర్యటన
- బైడెన్‌తో భేటీ

లోపలి పేజీలో..

పాక్‌లో నిరసనల హోరు
- నింగినంటుతున్న నిత్యావసరాల ధరలు
- సంక్షోభంతో సామాన్యుల వెతలు

ప్రాథమిక హక్కుల హననం

- చట్టబద్ధ పాలన లేదు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీం మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ విమర్శ



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న జస్టిస్ గోపాలగౌడ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చట్టబద్ధ పాలనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయని, పౌరుల ప్రాథమిక హక్కులను పాలకులు అణచివేస్తున్నారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ విమర్శించారు. విజయవాడ ఎంబివికెలో 'చట్టబద్ధ పాలన - భారత ప్రజాస్వామ్యం' అనే అంశంపై ఫోరం ఫర్ డెమొక్రసీ అండ్ డెవలప్‌మెంట్ శుక్రవారం చర్చాగోష్టి నిర్వహించింది. లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా జస్టిస్ గోపాలగౌడ ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ నెంబరు 1 ఆర్టికల్ 19కి వ్యతిరేకమని అన్నారు. అధికారంలో ఉన్నవారు చట్టసభల్లో చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని చెప్పారు. అమరావతి రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులతో కుదుర్చుకున్న ఒప్పందంపై ప్రభుత్వం ఉల్లంఘనలకు పాల్పడటం, రైతులపై కేసులు పెడుతుండటాన్ని ఆయన తప్పుపట్టారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కారులోనే కూర్చోవాలని, కారుపైకి రావద్దని విశాఖలో పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన ప్రస్తావించారు. అధికారంలో ఉన్న పార్టీలు ప్రతిపక్ష పార్టీల వాయిస్ ప్రజలకు చెప్పుకోవడానికి అవకాశం లేకుండా చేయడం ప్రజాస్వామ్యంలో తప్పు అని అన్నారు. ఎపిలో చట్టబద్ధ పాలన జరగడం లేదని, పోలీసు డిపార్టుమెంట్‌లో కొందరు ప్రైవేటు ఆర్మీలా పనిచేస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థలకు కేటాయించే నిధులను సైతం రాష్ట్రప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు వాటికే వినియోగించేలా అందరూ ప్రయత్నం చేయాలని అన్నారు. అదాని కంపెనీల వ్యవహారాన్ని విదేశీ ఏజెన్సీ బయటపెట్టిన తర్వాత నేటికీ 88 ప్రశ్నలకు ఆ కంపెనీ నుంచి సమాధానాలు రాలేదన్నారు.

జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. చాలా రాష్ట్రాల్లో కాగితాల్లోనే మంత్రి మండలి ఉంటుందని, పూర్తి నిర్ణయాధికారం ముఖ్యమంత్రులే తీసుకుంటున్నారన్నారు. కేరళ మినహా మిగిలిన రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు నిస్సార పాలన సాగిస్తున్నాయన్నారు. ప్రజలకుఅధికారం చేరువగా ఉండాలని, చట్టబద్ధ పాలన విఫలమవ్వడానికి అధికారం కేంద్రీకృతం కావడమే కారణమని అన్నారు. కొన్ని అసెంబ్లీ స్థానాల్లో రూ.50 కోట్లకు మిగతా 2లో

రాజధానిపై అభిప్రాయం తెలపాలి

- సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధానిపై ముఖ్యమంత్రి అభిప్రాయం ఏమిటో చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. అమరావతే రాజధానిగా ఉంటుందని సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. గతంలో పార్లమెంటు సాక్షిగా కేంద్రం పలుమార్లు స్పష్టం చేసిందని తెలిపారు. అప్పట్లో ప్రతిపక్షనేతగా జగన్ కూడా అంగీకరించారని వివరించారు. ఎపి హైకోర్టు కూడా అమరావతినే రాజధానిగా అభివృద్ధి చేయాలని తీర్పునిచ్చిందని వివరించారు. మూడు రాజధానుల బిల్లు పెట్టిన ప్రభుత్వం అనంతరం ఉపసంహరించుకుందని, ఒకటో తేదీకి ఉద్యోగులకు జీతాలు వేయలేని ప్రభుత్వం మూడు రాజధానులకు నిధులు ఎక్కడ నుంచి తీసుకొస్తుందని ప్రశ్నించారు. అటువంటి ప్రకటనలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన వారందరికీ మెరుగైన వైద్యం అందించేలా స్టీల్‌ప్లాంటు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల కుటుంబాలకు ధైర్యం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గాయపడిన వారిలో కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని, వారిని ఆర్థికంగా ఆదుకోవాలని, స్టీల్ ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లోక్ అదాలత్‌లకు భారీ స్పందన

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జరిగిన లోక్ అదాలత్‌లకు భారీ స్పందన వచ్చింది. 1,51,261 కేసులు పరిష్కారమయ్యాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని వివిధ కోర్టుల్లో 1,25,733 పెండింగ్ కేసులు మిగిలిన 25,528 ప్రీ లిటిగేషన్ కేసులున్నాయి. కక్షిదారులకు రూ.42.86 కోట్ల పరిహార చెల్లింపు ఉత్తర్వులు వెలువడ్డాయి. హైకోర్టులో న్యాయమూర్తులు జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ కె మన్మథరావు, జస్టిస్ టి రాజశేఖరరావు లోక్ అదాలత్ బెంచ్‌ల ద్వారా 201 కేసులు పరిష్కరించి, కక్షిదారులకు రూ.26.78 లక్షలు పరిహారంగా అందజేశారు. ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్, ఎపి లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ జస్టిస్ ఎవి శేషసాయి పర్యవేక్షణలో లోక్ అదాలత్ నిర్వహణ జరిగింది.

నిందితులుగా పోలీసుల చేర్పునకు నిరాకరణ

తండ్రీకుమారుల హత్య కేసులో తమతోపాటు పోలీసులను కూడా నిందితుల జాబితాలో చేర్చాలన్న పిటిషన్‌ను హైకోర్టు కొట్టేస్తూ తీర్పు చెప్పింది. పోలీసులను నిందితులుగా చేర్చేందుకు కింది కోర్టు నిరాకరించడాన్ని సవాల్ చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు తీర్పు చెప్పారు. కింది కోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి ఆస్కారమే లేదన్నారు. 2014 సెప్టెంబరులో గన్నవరం సమీపంలోని పెద అవుటపల్లి వద్ద పినకడిమిలో తండ్రీకుమారులు గంధం నాగేశ్వరరావు, గంధం మారయ్య, గంధం పగిడి మారయ్య తుపాకీ కాల్పుల్లో మరణించారు. ఈ కేసులో పోలీసులు 49 మందిని నిందితులుగా చేర్చి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరుకు చెందిన కానిస్టేబుళ్లు ముగ్గురితోపాటు అప్పటి 1వ టౌన్ ఎస్ఐను సాక్షులుగా చేర్చారు. పోలీసులను సాక్షులుగా చేర్చడం కాదని, నిందితులుగా చేర్చాలని ఆ కేసు నిందితుడు ప్రతాప్ సింగ్ ఇతరులు కేసు విచారణ జరిగే విజయవాడ కోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌లో తగిన ఆధారాలు చూపలేదని పోలీసుల తరపున సీనియర్ అడ్వకేట్ పి వీరారెడ్డి వాదించారు. కేసు విచారణ ఆలస్యం చేసేందుకే నిందితులు ఈ కేసు వేశారని పిపి యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదించారు. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది.

మార్క్సిజం ఎంతో విలువైనది

- కాలానికి అనుగుణంగా అభివృద్ధి చెందుతోంది
- మార్క్స్, ఏంగెల్స్ పుస్తకాల ఆవిష్కరణలో ఎంఎ బేబి



కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ సంకలిత రచనలను ఆవిష్కరిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, ప్రొఫెసర్ ఎన్ అంజయ్య తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్క్సిజం ప్రపంచానికి విలువైందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి అన్నారు. కాలానికి అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఇలా అభివృద్ధి చెందకపోతే సమకాలీన సమస్యలను తీర్చలేదన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ సంకలిత రచనల పుస్తకాల ఆవిష్కరణ శనివారం సాయంత్రం జరిగింది. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన మొదటి సంపుటిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, రెండో సంపుటిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎ బేబి హాజరై మాట్లాడారు. మార్క్సిజాన్ని చదవకుండా ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాదన్నారు. సమాజం ఎలా మారుతుందో మార్క్స్ పూర్తిగా అధ్యయనం చేశారని చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థ వల్ల సమాజంలో వర్గాలు, మనుషుల మధ్య అసమానతలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం 2008 ఆర్థిక సంక్షోభానికి పరిష్కార మార్గం మార్క్సిజంలోనే ఉందని, ఈ అంశాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా గ్రహించిందన్నారు. దేశంలో కమ్యూనిస్టులకు బలం తగ్గిందని, ఇది తాత్కాలికమేనని చెప్పారు. కచ్చితంగా మరలా పుంజుకుంటుందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మానవాళి బతికున్నంత వరకు మార్క్సిజం ఉంటుందని, విజయం సాధిస్తుందని ఏంగెల్స్ అన్న మాటలు సత్యమన్నారు.

మార్క్సిజం వైపు యువత చూస్తోందన్నారు. యువతను కమ్యూనిజం వైపు ఆకర్షించేందుకు ఈ సాహిత్యం ముఖ్యమైన ఆయుధమని అన్నారు. ఈ పుస్తకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు యువతరం కమ్యూనిస్టులు, మార్క్సిస్టు అభిమానులు కృషి చేయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. మార్క్సిజాన్ని విభేధించేవారు కూడా ఈ పుస్తకాలను చదవాలని కోరారు. సిఎం జగన్‌కు ఈ పుస్తకాలను అందించాలని సూచించారు. జగన్‌కు వర్గపోరుకు, కులపోరుకు తేడా తెలియడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కుల పోరును వర్గపోరు అంటున్నారని అన్నారు. ప్రొఫెసర్ ఎన్ అంజయ్య మాట్లాడుతూ మానవ జాతి శ్రేయస్సు కోసం మార్క్సిజాన్ని అధ్యయం చేయాలన్నారు. పెట్టుబడిదారీ విధానం ఎన్నిసార్లు కిందపడ్డా తనను తాను సరిదిద్దుకోలేకపోయిందన్నారు. విశాలంధ్ర పబ్లిసింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్ నాయుడు, కె లక్ష్మయ్య వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర బుక్‌హౌస్ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, సహాయ కార్యదర్శి జి ఓబులేస్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు కలెక్టరేట్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి -నెల్లూరు

నెల్లూరు కలెక్టరేట్‌లో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. కలెక్టరేట్ ప్రాంగణంలోని వెనుక భాగంలోని రేకుల షెడ్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ఎంత ప్రయత్నించినా అదుపులోకి రాకపోవడంతో మరో వాహనాన్ని తీసుకువచ్చారు. అతికష్టం మీద మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంతో ఒక్కసారిగా కలెక్టరేట్‌లో ఆందోళన నెలకొంది. తొలుత ముఖ్యమైన ఫైళ్లు తగలపడ్డాయని అందరూ భావించారు. ఉపయోగం లేని వస్తువులు మాత్రమే తగలబడ్డాయని తెలియడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అగ్ని ప్రమాదంలో ఎలాంటి నష్టమూ జరగలేదని, కేవలం ఉపయోగం లేని కొన్ని వస్తువులు మాత్రమే అక్కడ ఉన్నాయని, ఈ ప్రమాదంపై ఆరా తీస్తున్నామని కలెక్టర్ ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

మరింత భారంగా అమరావతి

- నిర్మాణాలకు కొత్త ధరలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అమరావతి రాజధాని నిర్మాణం మరింత భారం కానుంది. ఇప్పటికే పనులు నత్తనడకన సాగుతుండగా కొత్త రేట్లు అమలు చేయాలంటూ తీసుకున్న నిర్ణయం ఈ పరిస్థితికి కారణంగా మారనుంది. కొత్త రేట్లు వల్ల కార్మికులకు పెద్దగా ఉపయోగం లేకపోయినప్పటికీ, పరికరాలు, యంత్రాలు వంటి వాటిపై భారీగానే భారం పడనుందని సమాచారం. 2022 జూన్ ఒకటి నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చేలా అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్ణయం తీసుకుంది. 2021 జూన్ నుంచి అమలులో ఉన్న షెడ్యూల్ ఆఫ్ రేట్స్ (ఎస్ఓఆర్)ను సవరిస్తూ 2022 జూన్ ఒకటి నుంచి కొత్త రేట్లు అమలులోకి వచ్చేలా ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. ఈ రేట్లను బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజనీర్లు తయారుచేయగా, ప్రభుత్వం ఆమోదించింది. మూడేళ్లగా నిలిచిపోయిన రాజధాని నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని హైకోర్టు ఆదేశించగా, కేసు విచారణ ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉంది. పాత రేట్ల ప్రకారం పనులు చేస్తే పది వేల కోట్ల రూపాయలు అవుతాయన్నది అంచనా కాగా, కొత్త రేట్ల ప్రకారం ప్రాథమిక వ్యయమే 15 వేల కోట్ల వరకు చేరిపోతుందని అంటున్నారు. దీంతో అంచనా వ్యయం కూడా ప్రభుత్వం పెంచాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు.

లేబర్‌కు నామమాత్రంగానే

ఇక లేబర్ విభాగంలో కొత్త రేట్లు నామమాత్రంగానే పెరిగినట్లు తేలింది. ఉదాహరణకు బార్ బెండర్‌కు గతంలో 750 రూపాయలుగా ఉండగా, ఇప్పుడు 750కి పెరిగింది. బ్లాస్టర్ కార్మికులకు గతంలో 645 రూపాయలు ఉండగా, ఇప్పుడు 690కి చేరుకుంది. ఎలక్ట్రీషియన్‌కు గతంలో 650 ఉండగా, ఇప్పుడు 700కి చేరుకుంది. ఇలా అన్ని లేబర్ విభాగాల్లో 35 నుంచి 50 రూపాయల వరకు మాత్రమే పెరిగాయి,

లోకేష్‌కు ప్రాణహాని తలపెట్టే కుట్ర

- గవర్నర్‌కు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ప్రాణహాని తలపెట్టే కుట్ర జరుగుతోందని, యువగళం పాదయాత్రకు పోలీసులే అడ్డంకులు సృష్టిస్తున్నారని టిడిపి ఆరోపించింది. ఈ మేరకు టిడిపి ప్రతినిధుల బృందం శనివారం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. పాదయాత్రలోని ప్రచార రథాలు సీజ్ చేయడమే కాకుండా పోలీసులు మైకులు కూడా లాక్కుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల వద్దకు వెళ్లే హక్కు ప్రతిపక్ష నాయకులకు లేదా? అని, డిఐజి కొల్లి రఘురామిరెడ్డిపై చాలా అనుమానాలున్నాయని, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న పాదయాత్రకు ఇన్ని అడ్డంకులు సృష్టించడం దుర్మార్గమన్నారు. ఫిర్యాదుపై తప్పక న్యాయం చేస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని టిడిపి నేతలు పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బోండా ఉమామహేశ్వరరావు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఉన్నారు.

పేదల ఇళ్లు కూల్చివేత

- ముందస్తు సమాచారం లేదు.. విద్యుత్‌లైన్లు తొలగింపు
- పుంగనూరులో మున్సిపల్ అధికారుల దుశ్చర్య


పేదల ఇళ్లను కూల్చివేస్తున్న దృశ్యం


తమ ఇళ్లను కూల్చివేస్తుంటే ఏడుస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - పుంగనూరు (చిత్తూరు జిల్లా)

'అమ్మా మన ఇల్లు జెసిబితో కూల్చేస్తున్నారు..నాన్న కూడా లేడు' అని చిన్నారులు భోరున విలపిస్తూ జీవనం కోసం కూలి పనులకు వెళ్లిన తల్లికి విషయం చెప్పారు. 'మా ఇంటి వద్ద ఎవరూ లేరు, ఉన్నపళంగా మా ఇంటిని కూల్చివేస్తే మేము ఎక్కడికి వెళ్లాలి' అంటూ అధికారుల కాళ్లపై పడి చిన్నారులు వేడుకున్నా వారి మనసు కరగలేదు. చిత్తూరు జిల్లా పుంగనూరులో మున్సిపల్ అధికారులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ముందస్తు సమాచారం లేకుండా పట్టణంలోని నానాసాబ్‌పేటలో ఉన్న దాదాపు 20 పేదల ఇళ్లను శనివారం జెసిబిలతో కూల్చివేశారు. ఆ సమయంలో పేదలు కూలి పనులకు వెళ్లడంతో వారి ఇంటిలోని సామాన్లను అధికారులే బయట పడేశారు. విద్యుత్‌లైన్లను సైతం అప్పటికప్పుడే తొలగించారు. ముందస్తు నోటీసులు ఇచ్చామని అధికారులు చెబుతుండగా, తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పేదలు వాపోతున్నారు. తరతరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, అభివృద్ధి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని బాధితులు మండిపడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, రూరల్ సిఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇళ్ల కూల్చివేత కార్యక్రమం జరిగింది. ఈ విషయమై కమిషనర్‌ను సంప్రదించేందుకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్‌లో ఉంది. విషయం తెలుసుకున్న టిడిపి, వామపక్షాలు అక్కడికి చేరుకుని నిరసన తెలపబోతుండగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

పార్కు అభివృద్ధికి ఆక్రమణ తొలగింపు

పుంగమ్మ చెరువు కట్టను పార్కుగా అభివృద్ధి చేసేందుకే ఇళ్లను తొలగించాం. కట్టను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇళ్లు కోల్పోయిన వారందరికీ తాత్కాలికంగా జెఎండి కల్యాణ మండపంలో వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశాం. ఇళ్లు కోల్పోయిన అందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేసి గృహ నిర్మాణ పథకం ద్వారా ఇంటి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. - అలీమ్‌బాషా, మున్సిపల్ ఛైర్మన్

ఉన్నపళంగా కూల్చేయడం దారుణం

ఉన్నపళంగా 20 మంది పేదల ఇళ్లు కూల్చేయడం దారుణం. ఏదైనా అభివృద్ధి చేయాలనుకుంటే ఆ ప్రాంతంలో ఉండే ప్రజలకు ముందుగా తెలియజేసి, ప్రత్యామ్నాయం ఏర్పాటుచేసిన తరువాత తొలగించాలే తప్ప, దౌర్జన్యం చేయడం తగదు.

- వి.గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి


ఆర్‌డిఒను నిలదీస్తున్న టిడిపి నాయకులు

భోగాపురంలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

వాగ్వివాదానికి దిగారు. ఆర్‌డిఒ స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉన్నందున గ్రామాలను ఖాళీ చేయాల్సిందేనని ఆర్‌డిఒ తేల్చి చెప్పారు. భోగాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయనాథ్ ఆధ్వర్యంలో భోగాపురం, డెంకాడ ఎస్ఐలు కృష్ణమూర్తి, మహేష్‌పాటు బలగాలను మోహరించారు. మరోపక్క ఖాళీ చేయిస్తున్న ఇళ్ల నుంచి సామగ్రిని తరలించుకుంటూ నిర్వాసిత కాలనీలకు బరువెక్కిన హృదయాలతో బాధితులు పయనయ్యారు. బాధితుల సామగ్రి కోసం తాహశీల్దార్ కోరాడ శ్రీనివాస్ ప్రత్యేకంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేయించారు.

న్యాయం చేయాలి : చంద్రబాబు

భోగాపురం విమానాశ్రయం నిర్వాసితులకు న్యాయం చేయాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. భోగాపురం నిర్వాసిత గ్రామం మరడపాలెంలో నిర్వాసితుల ఇళ్ల కూల్చివేతను ఖండిస్తున్నట్లు శనివారం ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. ప్రభుత్వ హామీలు, ప్యాకేజీ అంశాలను అమలు చేయకుండానే గ్రామంలో ఇళు కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను కీలకమైన ప్రదేశాలలో నియమించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి తెలిపారు.. ఈ విభాగంలో భద్రతా చర్యలు కొరవడ్డాయని తెలిపారు. కీలక విభాగాలలో కార్మికుల సంఖ్యను ఇప్పటికైనా పెంచాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన భారీ పేలుడుకు బిజెపియే భాధ్యత వహించాలని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. బిజెపి రెండేళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అనుసరిస్తోన్న కుట్రపూరిత చర్యల వల్లే వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు.

అవసరమైతే చికిత్సకు ముంబయి తరలిస్తాం : మంత్రి అమర్‌నాథ్

స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-2 విభాగంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. ప్రమాద తీవ్రతను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులందరికీ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అవసరమైతే మరింత మెరుగైన వైద్య సహాయం అందించేందుకు ఎయిర్‌లిఫ్ట్ ద్వారా ముంబయి తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశించినట్టు తెలిపారు. ఈ మేరకు ముంబయిలోని సంబంధిత వైద్యులతో కూడా మాట్లాడామన్నారు. ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించనున్నామని తెలిపారు.

కేంద్రం, స్టీల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం : సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

కేంద్రం, స్టీల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న వరుస ప్రమాదాలకు అధికారుల పర్యవేక్షణా లోపం కూడా కారణమన్నారు. యాజమాన్యం ప్రయివేటీకరణ ఎప్పుడవుతుందని చూస్తుందేగానీ అవసరానికి తగినంతమంది ఉద్యోగులను నియమించడంపై శ్రద్ధ వహించడం లేదని తెలిపారు. ఈ ప్రమాదాలను సాకుగా చూపించి ప్రయివేటీకరణకు మార్గం సులభతరం చేసుకునే విధంగా యాజమాన్యం పథకం రచిస్తోందని విమర్శించారు.

ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం దారుణం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా అమ్మేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, ఎం.రాజశేఖర్, వరసాల శ్రీనివాసరావు, డి.సురేష్, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 730వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎల్ఎంఎం, ఎస్‌బిఎం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు మోడీ సర్కారు తహతహలాడుతోందన్నారు. రానున్న కాలంలో ఆ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం ప్రారంభించి రెండేళ్లవుతోందని, ఈ కాలంలో ఉద్యమానికి సహకరించిన అందరికీ పోరాట కమిటీ ధన్యవాదాలు తెలుపుతోందని వెల్లడించారు. శనివారం ఉక్కు ఎస్ఎంఎస్-2లో జరిగిన ప్రమాదం పట్ల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత విషయంలో రాజీ పడొద్దన్నారు. ప్రమాదంలో గాయపడిన ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న శ్రీకాళహస్తి ధర్మకర్తమండలి, ఇఒ, మండలి సభ్యులు

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

- పేలిన బాయిలర్
- ఇద్దరికి స్వల్పగాయాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ చక్రపాణిరెడ్డి దంపతులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం ప్రధాన అర్చకులు, వేదపండితులు బ్రహ్మోత్స కార్యక్రమాన్ని ప్రారంభించారు. యాగశాల ప్రవేశం అనంతరం, చండీశ్వర పూజ నిర్వహించారు. సాయంకాలం అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తి దేవస్థానం తరపున దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి కె.వి సాగర్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి 18న పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. 21 వరకూ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. దేవస్థానంలోని నిత్య కళారాధన వేదికపై నంద్యాలకు చెందిన సాయి నాట్యమంజలి వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, భ్రామరి కళావేదికపై భరతనాట్యం, బ్రహ్మంగారి చరిత్ర, కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ప్రదర్శించారు. శ్రీశైలం నిత్యాన్నదాన సత్రం వంట గదిలో బాయిలర్ పేలింది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఇద్దరి కార్మికులకు స్వల్పగాయాలయ్యాయి. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు.

సంయమనంతో న్యాయపోరాటం

- అమరావతి జెఎసి నాయకుల వెల్లడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అంశాలపై ఈ నెల 23 నుంచి సుప్రీం కోర్టులో విచారణ జరగనుందని అమరావతి జెఎసి లీగల్, ఫైనాన్స్ ప్రొగ్రామ్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ మాదల శ్రీనివాస్ తెలిపారు. అందువల్ల గత మూడేళ్లగా న్యాయపోరాటం చేస్తోన్న రాజధాని రైతులు సహనం, సంయమనంతో వ్యవహరించాలని కోరారు. గుంటూరులో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాజ్యసభలో ఎంపి విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ చేసిన ప్రకటన ప్రకారం 2015లో రాజధానిగా అమరావతి నోటిఫై అయిందన్నారు. మూడు రాజధానుల అంశంపై కేంద్రాన్ని సంప్రదించలేదని మంత్రి ప్రకటనతో స్పష్టమైందని తెలిపారు. సిఆర్‌డిఎ చట్టం ప్రకారం అప్పటి ప్రభుత్వంతో రైతులు ఒప్పందం చేసుకున్నారని, ఈ ఒప్పందం ప్రకారం మూడేళ్లలో అభివృద్ధి చేసిన ప్లాట్లను రైతులకు అప్పగించాల్సి ఉందన్నారు. 2019లో రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానుల అంశం తెరపైకి తేవడం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. కేంద్రం తన వైఖరి వెల్లడించిన తరువాత ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం శివరామకృష్ణన్ కమిటీ నివేదికను బయటకు తేవడం విడ్డూరంగా ఉందన్నారు. శివరామకృష్ణన్ నివేదిక ఆధారంగా అమరావతిని ఎంపిక చేసి అసెంబ్లీలో టిడిపి, వైసిపి, బిజెపి సభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన విషయాన్ని మరవరాదన్నారు. సమావేశంలో జెఎసి నాయకులు ధనేకుల రామారావు, కళ్ళం రాజశేఖరరెడ్డి, భాగ్యరావు, ఆకుల ఉమామహేశ్వరరావు, బ్రహ్మయ్య, కొరకల్లు రామరాజు పాల్గొన్నారు.

నేడు గుంటూరులో బిపి మండల్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మండల్ కమిషన్ ఛైర్మన్, సామాజిక న్యాయ యోధుడు బి.పి.మండల్ విగ్రహాన్ని గుంటూరు అమరావతి రోడ్డులోని సినీస్క్వేర్ జంక్షన్‌లో ఆదివారం ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రులు అఖిలేష్ యాదవ్(యుపి), సిద్దరామయ్య (కర్ణాటక), బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, ద్రావిడ కళగం అధ్యక్షులు కె.వీరమణి, ఎంపిలు కనిమొళి, పి.విల్సన్, మనోజ్‌కుమార్ ఝూ, తిరుమావళన్, తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, బిపి మండల్ మనమడు సూరజ్‌మండల్, రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు హాజరు అవుతారని విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ జంగా కృష్ణమూర్తి, కో కన్వీనర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణ తరువాత బిసి ఆత్మగౌరవ సభ జరుగుతుందని పేర్కొన్నారు.

ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని తొలగించాలి

(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆలస్యంగా వచ్చిన పోలీసులు స్కూలు యాజమాన్యంతో మంతనాలు జరిపారు. ఈ లంచ్ బాక్సులు తమవేనని, విద్యార్థుల భర్తడేల కోసమని తెప్పించామని యాజమాన్యం తొలుత బుకాయించే ప్రయత్నం చేసింది. ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి తరుపున పంపిణీ చేసేందుకు ఈ గిఫ్ట్ బాక్సులను తమ స్కూల్లో ఉంచారని ఆ తర్వాత ఒప్పుకుంది. దీంతో, ఈ బాక్సులు ఉన్న గదిని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాథమిక హక్కుల హననం

(మొదటి పేజీ తరువాయి)

పైగా ఖర్చు చేస్తున్నారని, వారు అవినీతికి పాల్పడకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. రాజకీయ పార్టీలు ప్రైవేటు ఆస్తులుగా మారుతున్నాయని, అప్పుడు రాజ్యమే ప్రైవేటు ఆస్తిగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు.

కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రతిపక్షాలను అణచివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకేలా వ్యవహరిస్తున్నాయన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్నాయని అన్నారు. నిరసన తెలుపుకునే హక్కుపై అనేక ఆంక్షలు విధిస్తున్నాయన్నారు. నిరసన వ్యక్తం చేసే స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం మనుగడే లేదన్నారు. రాష్ట్రప్రభుత్వం జిఓ నెంబరు 1ని తెచ్చి విపక్షాల గొంతు నొక్కుతోందని అన్నారు. ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలంటే అదే పార్టీలో కనీసం ఐదేళ్లు పనిచేసే నిబంధన పెట్టాలని, భారత ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయాలని లక్ష్మణరావు సూచించారు. పాలకుల ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సిపిఎస్ రద్దు చేయాలంటూ నిరసన తెలుపుకోవడానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఆహ్వానితులను ప్రొఫెసరు చిన్నయసూరి వేదికపైకి ఆహ్వానించగా, నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు నరసింహారావు వందన సమర్పణ చేశారు.

వివేకా హత్యపై జగన్ దంపతులు నోరుతెరవాలి

- ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఉదంతంపై సిఎం వైఎస్ జగన్ దంపతులు నోరు తెరవాలని టిడిపి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప డిమాండ్ చేశారు. హత్య కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ సిఎం దంపతులదేనని శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. హత్యతో ఎలాంటి సంబంధం లేకపోతే హత్య జరిగిన రోజు అర్ధరాత్రి అవినాష్‌రెడ్డితో నవీన్, కృష్ణమోహన్ రెడ్డి ఫోన్ ద్వారా ఏం మాట్లాడారని ప్రశ్నించారు. సంబంధం లేకపోతే కాల్ డేటాను బయటపెట్టాలని సిబిఐని కోరే నిజాయితీని నిరూపించుకోగలరా? అని ప్రశ్నించారు. హత్య ఆనవాళ్లను అవినాష్, భాస్కర్ రెడ్డి ధ్వంసం చేశారని, ఇది హత్యతో సమానమేనని ఎంపి స్థాయి వ్యక్తికి తెలియదా? అని నిలదీశారు. హత్య కేసులో అరెస్టయిన శివశంకర్‌రెడ్డిని వైసిపి నుంచి ఎందుకు బహిష్కరించలేదని ప్రశ్నించారు. నిందితుడిగా అరెస్టయిన దేవిరెడ్డి శివశంకర్ రెడ్డిని కోర్టు అనుమతి లేకుండా రిమ్స్‌కు తరలించడం వెనుక సిఎం జగన్ పాత్ర లేదని చెప్పగలరా అని నిలదీశారు. టిడిపి విడుదల చేసిన జగనాసుర రక్తచరిత్ర పుస్తకంలోని అంశాలపై సిఎం దంపతులు నోరుమెదపకుండా పేర్ని నాని ఏం అర్హత ఉందని మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

అబద్ధాల పుట్ట

టిడిపి పుస్తక ప్రచురణపై మాజీ మంత్రి పేర్ని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగన్‌పై టిడిపి ప్రచురించిన పుస్తకం అబద్ధాల పుట్ట అని, దానిలో వాస్తవాలు లేవని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. జగన్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా టిడిపి రాసిన పుస్తకం ఉందని తెలిపారు. అది ఎక్కడ ప్రచురించారో, ఎవరు ప్రచురించారో కూడా పుస్తకం మీద ముద్రించుకోలేని స్థితిలో టిడిపి నాయకులు ఉన్నారని పేర్కొన్నారు. వివేకానంద రెడ్డి హత్య జరిగిన సమయంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉందని, అప్పుడు ఎందుకు విచారణ చేపట్టలేకపోయారని ప్రశ్నించారు. ఆయన భార్య, కుమార్తె, అల్లుడిని ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. అప్పట్లో జరిగిన అవినీతి, అక్రమాలపై పోలీసులు ఏం చేశారని ప్రశ్నించారు. అప్పట్లో డాక్టర్ సునీత వాంగ్మూలం ఎందుకు తీసుకోలేదని అన్నారు. ఎఫ్ఐఆర్‌లో జగన్, ఎంపి అవినాష్‌రెడ్డి పేర్లు ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. సాక్ష్యాలు చెరిపేస్తే కేసులు ఎందుకు పెట్టలేదో తెలపాలన్నారు.

కార్పొరేట్ల పోకడలకు కళ్లెం వేయాలి

- అరసం 19వ రాష్ట్ర మహాసభలో కత్తి పద్మారావు
- యువతను అభ్యుదయవాదం వైపు నడిపించాలి : సుఖ్‌దేవ్‌సింగ్ సిర్సా



ప్రారంభోపన్యాసం చేస్తున్న ప్రొఫెసర్ సుఖ్‌దేవ్‌సింగ్ సిర్సా

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

హిందుత్వ, కార్పొరేట్ శక్తుల పోకడలకు కళ్లెం వేసే దిశగా అభ్యుదయ రచయితల ఉద్యమం సాగాలని అభ్యుదయ కవి, ఎపి దళిత మహాసభ వ్యవస్థాపకుడు డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. రెండ్రోజులపాటు జరుగనున్న అరసం 19వ రాష్ట్ర మహాసభ గుంటూరు జిల్లా తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం ప్రారంభమైంది. అరసం రాష్ట్ర అధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య వక్తగా కత్తి పద్మారావు మాట్లాడారు. అభ్యుదయ విప్లవం, సాహిత్యంలో శ్రీశ్రీ, గుర్రం జాషువా, గురజాడ అప్పారావు వంటి ఎందరో మహామహులున్నారని తెలిపారు. శ్రీశ్రీది ఆర్థిక అభ్యుదయ విప్లవమని, శ్రీకృష్ణదేవరాయలది సాంప్రదాయ అభ్యుదయ విప్లవమని, గుర్రం జాషువాది సామాజిక అభ్యుదయ విప్లవమని వివరించారు. అభ్యుదయ వాదం నెరవేరాలంటే డాక్టర్ బిఆర్ అంబేద్కర్, కారల్ మార్క్స్, జ్యోతిరావ్ పూలే వంటి మహోన్నత వ్యక్తుల స్ఫూర్తితో లాల్ నీల్ సిద్ధాంతంతో ముందుకు సాగాలని ప్రతిపాదించారు. మహాసభ ప్రారంభోపన్యాసంలో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సుఖదేవ్ సింగ్ సిర్సా మాట్లాడుతూ.. అభ్యుదయం గురించి మాట్లాడేవారి గొంతుకను నొక్కి వారిని అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తినే తిండి, ధరించే వస్త్రాలపై కూడా స్వాతంత్ర్యం లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సగటు మనిషి జీవితాన్ని హిందూ భావజాలం, కార్పొరేట్ శక్తులు శాసిస్తున్నాయని విమర్శించారు. భాషలు, ప్రాంతాలు వేరైనా ప్రజల్లో ఒకే రకమైన సామరస్యం ఉండాలన్నారు. యువతను అభ్యుదయ భావజాలం వైపు నడిపించాల్సిన బాధ్యత అరసంపై ఉందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని, ప్రగతిశీల సాహిత్యం మరింత వెలువడ్డానికి ఈ సభలు దోహదపడాలని ఆకాక్షించారు. అఖిల భారత అరసం కార్యదర్శి వినీత్ తివారి, కార్యవర్గ సభ్యులు వేల్పుల నారాయణ, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, అరసం గౌరవాధ్యక్షులు డాక్టర్ పి.సంజీవమ్మ, జాతీయ సమితి కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, ఆహ్వానసంఘం అధ్యక్షులు బుర్రా సాయిమాధవ్ పాల్గొన్నారు.



బాలోత్సవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

పిల్లలకు స్వేచ్ఛనివ్వాలి

- బాలోత్సవంలో గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

తల్లిదండ్రులు పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలని, క్రమశిక్షణ అవసరమే అయినప్పటికీ అది శృతిమించకూడదని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గుంటూరు లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ ప్రాంగణంలో రెండు రోజులపాటు జరిగే గుంటూరు బాలోత్సవం శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ, బాలోత్సవ్ నిర్వహణ కమిటీ అధ్యక్షులు కెఎస్.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లల పండుగను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో నైపుణ్యాలకు కొదవ లేదని, వాటిని వెలికి తీయడానికి సరైన వేదికలు ఏర్పాటు చేయడమే కీలకమని పేర్కొన్నారు. అటువంటి వాటిల్లో బాలోత్సవం నిర్వహణ అభినందనీయమన్నారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యా కార్పొరేటీకరణ అయిన తరువాత విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల్లో ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీయడానికి బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఎస్ఇ జి.బ్రహ్మయ్య, జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, అమరావతి బాలోత్సవం ప్రతినిధులు పిన్నమనేని మురళీకృష్ణ, రామరాజు, గుంటూరు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్, తదితరులు ప్రసంగించారు. అనంతరం మొదటి రోజు 10 అంశాల్లో పోటీలు జరగ్గా సుమారు 2500 మంది పాల్గొన్నారు.

త్రిపురలో ప్రజాస్వామ్యం ధ్వంసం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని బిజెపి ధ్వంసం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. త్రిపుర సంఘీభావ సభను ఏలూరులోని పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. త్రిపురలో వామపక్ష కార్యకర్తలపై బిజెపి హింసాత్మక దాడులకు పూనుకుంటోందని, ఇప్పటి వరకు 667 పార్టీ కార్యాలయాలు, 3,363 ఇళ్లు ధ్వంసం చేసిందన్నారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న వామపక్ష కార్యకర్తలపై కూడా బిజెపి దాడి చేస్తోందని, ఈ పరిస్థితుల్లో త్రిపురలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయా అన్న అనుమానం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిపించాలని, ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసే పరిస్థితులను ఎన్నికల కమిషన్ కల్పించాలని కోరారు. డబ్బు, అధికారాన్ని బిజెపి పెద్దఎత్తున దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. బిజెపి అధికార దుర్వినియోగాన్ని ఆపాలని, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. బిజెపి దుర్మార్గాలను, దాడులను



సంఘీభావ సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఐక్యంగా ఎదుర్కోవాలని కోరారు. మతం పేరుతో ప్రజల మధ్య బిజెపి చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధిపొందుతోందని విమర్శించారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు దేశసంపదను దోచిపెడుతోందన్నారు. త్రిపురలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో కూడా బిజెపిని ఓడించాలని కోరారు. ఈ సభలో సిపిఎం జిల్లా నాయకులు పి.కిషోర్, రామకృష్ణ, ఎం.నాగమణి, ఏలూరు నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, రవికిషోర్ పాల్గొన్నారు.

శిలాజ ఇంధనాలు కావాలి

ఎస్సార్ ఆయిల్ ఛైర్మన్ వెల్లడి

బెంగళూరు : దేశంలో ఉద్గారాల తీవ్రతను 45 శాతం తగ్గించాలన్న లక్ష్యాన్ని చేరుకోవడంలో శిలాజ ఇంధనాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని ఎస్సార్ కాపిటల్ డైరెక్టర్, ఎస్సార్ ఆయిల్ యుకె బోర్డు ఛైర్మన్ ప్రశాంత్ రుయా పేర్కొన్నారు. ఇక్కడ నిర్వహించిన ఇండియా ఎనర్జీ వీక్‌లో 'అతి తక్కువ కార్బన్ ఎనర్జీ మిక్స్ దిశగా పరివర్తన : ఇంధన కంపెనీలు ఏ విధంగా స్వీకరిస్తున్నాయి..?." అనే అంశంపై రుయా మాట్లాడుతూ.. ఇప్పటికే ఉన్న స్వచ్ఛఇంధన సామర్థ్యాల మార్పు, నూతన శక్తి సామర్థ్యాలను కలిపి సృష్టించాలన్నారు. ప్రస్తుత ఇంధనాలను ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదని, నూతన, స్వచ్ఛ ఇంధన వ్యవస్థలను నిర్మించడానికి ప్రస్తుత మౌలిక సదుపాయాలను వినియోగించాల్సి ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో అసాధారణ వృద్ధి కనిపించనుందన్నారు.

నాయుడుపేటలో పేలిన గ్యాస్ పైప్ లైన్

ప్రజాశక్తి - నాయుడుపేట (తిరుపతి)

తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరు సమీపంలోని పారిశ్రామికవాడ వద్ద గ్యాస్ పైప్‌లైన్ పేలుడు కలకలం సృష్టించింది. ఒక్కసారిగా పెద్దశబ్దంతో పేలుడు సంభవించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.ప్రయోగాత్మకంగా ఇంటింటికీ గ్యాస్‌ను అందించేందుకు అదానీ కంపెనీకి చెందిన ఎజి అండ్ పి అనే కంపెనీ పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టింది.

అమరావతి పేరుతో మోసం

- టిడిపి అధికార ప్రతినిధి పట్టాభిరామ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి నిర్మాణం పేరుతో సిఎం వైఎస్ జగన్ బ్యాంకుల్ని మోసగించారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణాన్ని అటకెక్కించిన జగన్ ఏముఖం పెట్టుకుని సిఆర్‌డిఎ ద్వారా బ్యాంకుల నుంచి రూ.3,013 కోట్ల రుణం తీసుకున్నారని ప్రశ్నించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019-20 కాగ్ నివేదికలో సిఆర్‌డిఎ సంస్థ ద్వారా అమరావతి ముసుగులో జగన్ అప్పులు తీసుకున్నారని విమర్శించారు. తీసుకున్న అప్పుకు కనీసం వడ్డీ కూడా చెల్లించకపోవడంతో సిఆర్‌డిఎ కార్యాలయానికి బ్యాంకు అధికారులు వచ్చి నిలదీశారని పేర్కొన్నారు. అమరావతి బాండ్స్‌కు సంబంధించి ఉన్న మారటోరియం పీరియడ్ 2023 మార్చితో ముగియనుందని తెలిపారు. ఏప్రిల్ నుంచి తీసుకున్న రుణానికి రూ.400 కోట్ల అసలు చెల్లించాలన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంపై వైసిపి మౌనమెందుకు : అనురాధ

ఢిల్లీ మద్యం కుంభకోణంపై వైసిపి నేతలు ఎందుకు నోరు మెదపటం లేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంచుమర్తి అనురాధ ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో వైసిపి నేతలు ఇరుక్కుని ఢిల్లీ నడివీధుల్లో రాష్ట్ర ప్రతిష్టను మంటగలిపారని అన్నారు.



మహిళా కూలీలతో మాట్లాడుతున్న నారా లోకేష్

జగన్ హయాంలో యువతకు ఉపాధి కరువు

- డిఎస్‌సి, ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్లు లేవు
- 'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం

జగన్ హయాంలో యువతకు ఎటువంటి ఉపాధి అవకాశాలూ లేవని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు 40 వేల పరిశ్రమలను తీసుకువచ్చి, ఆరు లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర శనివారం చిత్తూరు జిల్లా పిళ్లారికుప్పం నుంచి ప్రారంభమైంది. మార్గమధ్యలో మహిళా కూలీలతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిసిలతో ముఖాముఖి నిర్వహించారు. బిసిలకు ఆర్థిక స్వాతంత్ర్యం టిడిపితోనే సాధ్యమన్నారు. అధికారంలోకి వస్తే డిఎస్‌సి, ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి జగన్ మాటతప్పారని దుయ్యబట్టారు. పాఠశాలలను మూసివేస్తున్న పరిస్థితుల్లో జగన్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. బిసి మంత్రి ఎందుకు మౌనం పాటిస్తున్నారో అర్థం కావడం లేదని, బిసిలకు ఎంత ఖర్చు చేశారో డిబేట్‌కు రావాలని సవాల్ విసిరారు. అనంతరం కార్వేటినగరంలో యాదవులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బిసి సంఘం అధ్యక్షులు ఎం.రవి యాదవ్ మాట్లాడుతూ.. యాదవ సామాజిక తరగతికి ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా లోకేష్ హామీ ఇచ్చారు. అంతకుముందు పిళ్లారికుప్పంలో కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు లోకేష్ రన్నింగ్ చేశారు. కార్యకర్తలందరూ ఆయనతో పాటు రన్నింగ్‌లో పాల్గొన్నారు. పిళ్లారికుప్పం నుంచి ప్రారంభమైన పాదయాత్ర కార్వేటినగరం మండలానికి చేరుకుంది. ఆదివారం కార్వేటినగరం మండలం నుంచి యాత్ర ప్రారంభం కానుంది.

నియంత్రణ సంస్థలు చూసుకుంటాయి!

- అదాని వ్యవహారంపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్
- ఆర్‌బిఐ బోర్డుతో భేటీ

న్యూఢిల్లీ : అదాని గ్రూపు సంక్షోభంపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు స్పందించారు. భారత నియంత్రణ సంస్థల్లో అనుభవమున్న వ్యక్తులు, నిపుణులు ఉన్నారని, ఎప్పటిలానే వాటి పని అవి చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. శనివారం మంత్రి ఆర్‌బిఐ బోర్డుతో భేటీ అయ్యారు. అనంతరం ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. అదానీ గ్రూపునపై వచ్చిన తీవ్ర ఆరోపణలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి ఒక్క మాటలో భారత రెగ్యులేటరీ సంస్థలు వాటి పని అవి చూసుకుంటాయన్నారు. కొత్త పన్ను విధానం వల్ల మధ్య తరగతికి చెందిన వేతన జీవులకు మేలు జరుగుతుందన్నారు. చేతిలో డబ్బులు మిగిల్చే ఉద్దేశ్యంతోనే నూతన పన్ను విధానం ప్రవేశపెట్టామన్నారు. క్రిప్టో కరెన్సీల అంశంలో నియమ, నిబంధనలపై జి 20 దేశాలతో చర్చిస్తున్నామన్నారు. ఆర్‌బిఐ బోర్డు అంతర్జాతీయ, జాతీయ ఆర్థిక పరిస్థితులు, సవాళ్లను సమీక్షించిందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రతి ఏడాది కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్థిక మంత్రి ఆర్‌బిఐ బోర్డును ఉద్దేశించి మాట్లాడుతారు. ఈ ఆనవాయితీగానే 2023-24 బడ్జెట్ ప్రకటన తర్వాత మంత్రి సీతారామన్ భేటీ అయ్యారు. బడ్జెట్‌పై ఆర్థిక మంత్రిని అభినందిస్తూ, ఆర్‌బిఐ బోర్డు సభ్యులు ప్రభుత్వం పరిశీలన కోసం కొన్ని సూచనలు చేశారని అధికార వర్గాలు తెలిపాయి.

ముడి చమురు ధరలు స్థిరంగా ఉంటే 2023-24లో ద్రవ్యోల్బణం 5.3 శాతానికి చేరనుందని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో బ్యారెల్ చమురు 95 డాలర్లు ఉండొచ్చన్నారు. రుణాలు, డిపాజిట్లపై వడ్డీ రేట్లు అనేవి పోటీ మార్కెట్ నిర్ణయిస్తుందన్నారు. వడ్డీ రేట్లు ఇప్పుడిప్పుడే సానుకూలంగా మారాయని అన్నారు. దీర్ఘ కాలానికి ప్రతికూల లేదా అధిక వడ్డీ రేట్లు అస్థిరతను సష్టించగలవన్నారు. వడ్డీ రేటు పెరుగుదల ధరల స్థిరత్వంలో ఒక బాగమన్నారు. ఇటీవలి ఆర్‌బిఐ రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు పెంచి 6.50 శాతానికి చేర్చిన విషయం తెలిసిందే. సర్వీస్ సెక్టార్ ఎగుమతులు చాలా బాగా జరుగుతున్నాయని, చెల్లింపుల బ్యాలెన్స్ పరిస్థితి బాగుందన్నారు. రెమిటెన్స్‌లు 27 శాతం పెరిగాయన్నారు. సరుకుల ఎగుమతులు పుంజుకుంటున్నాయని పేర్కొన్నారు. దీంతో వార్షిక లక్ష్యాన్ని 400 బిలియన్ డాలర్లు సాధించడం సాధ్యపడుతోందని దాస్ పేర్కొన్నారు. చమురు ధరలు గణనీయంగా తగ్గితే.. ఇతర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం తగ్గడానికి దారితీయడం ద్వారా ఆర్‌బిఐ పరపతి విధానానికి అనుకూలంగా మారనుందన్నారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రులు భగవత్ కరాద్, పంకజ్ చౌదరి, ఆర్థిక కార్యదర్శి సోమనాథన్, దీపమ్ సెక్రటరీ తుహిన్ కాంత పాండే, రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్, బ్యాంకింగ్ సెక్రటరీ వివేక్ జోషి తదితరులు పాల్గొన్నారు.

ఐఒ టెక్‌తో సిన్జెంటా జట్టు

న్యూఢిల్లీ : గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడానికి వీలుగా వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంపై అవగాహన పెంచడానికి ఐఒ టెక్‌తో సిన్జెంటా భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఇందులో డ్రోన్ సాంకేతికత ఉపయోగంపె గ్రామీణ యువతకు శిక్షణ అందించడంతో పాటుగా అభివృద్ధి చేసేందుకు



2000 డ్రోన్లను అందుబాటులోకి తీసుకు రానున్నట్లు సిన్జెంటా పేర్కొంది. దేశంలోని విభిన్న ప్రాంతాలలో ఐఒ టెక్ వరల్డ్ డ్రోన్ సాంకేతికత వినియోగించి సిన్జెంటా అనుమతించిన రసాయనాలను స్ప్రే చేయడం గురించి కలిసి పనిచేయనున్నాయని తెలిపింది. భారీ స్థాయిలో 400 ఎకరాలపై ట్రయల్స్ చేసిన తర్వాత 20 పంటలకు సంబంధించి డాటాను రెగ్యూలేటర్లకు సమర్పించడం జరిగిందని సిన్జెంటా ఎండి, కంట్రీ హెడ్ సుశీల్ కుమార్ పేర్కొన్నారు.

అదాని కంపెనీల షేర్ల తనఖా

- ఎస్‌బిఐ క్యాప్ వెల్లడి

న్యూఢిల్లీ : అదాని గ్రూపునకు చెందిన మూడు కంపెనీల షేర్లను తనఖాగా పెట్టుకున్నామని ఎస్‌బిఐ క్యాప్ ట్రస్టీ కో వెల్లడించింది. దీంతో రుణాలు ఇచ్చినట్లు బిఎస్ఇకి సమాచారం ఇచ్చింది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లను తనఖాగా పెట్టుకున్నట్లు ఎస్‌బిఐకి చెందిన ఈ సంస్థ వెల్లడించింది. అయితే ఈ షేర్లపై ఎంత రుణం ఇచ్చిందనే అంశాన్ని ఎస్‌బిఐ క్యాప్ వెల్లడించలేదు. అమెరికన్ సంస్థ హిండెన్ బర్గ్ రిపోర్ట్ దెబ్బకు జనవరి 24 నుంచి అదానీ కంపెనీల షేర్లు భారీ పతనాన్ని చవి చూస్తున్న విషయం తెలిసిందే.

పోలవరం ప్రాజెక్టు కార్మికులకు ఫుడ్‌పాయిజన్

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో పనిచేస్తున్న 88 మంది కార్మికులకు ఫుడ్ పాయిజన్ అయ్యింది. ప్రాజెక్టు మెస్-4లో కలుషిత ఆహారం తినడంతో శనివారం అస్వస్థతకు గురయ్యారు. కార్మికులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం ప్రాజెక్టులో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన సుమారు నాలుగు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి భోజన సదుపాయాల కోసం పోలవరం ప్రాజెక్టులో ఓ ప్రయివేటు కాంట్రాక్ట్ ద్వారా మెస్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి మెస్‌లో వంకాయ, బంగాళదుంప, పప్పుచారు కూరలతో కార్మికులకు భోజనాలు వడ్డించారు. భోజనాలు తిన్నవారిలో కొంతమంది వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి లక్షణాలతో అస్వస్థతకు గురయ్యారు. వీరిలో కొందరు వెంటనే పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకున్నారు. శనివారం ఉదయానికి మరికొంత మంది అస్వస్థతకు గురి కావడంతో పోలవరం ప్రాజెక్టు వాహనాల్లో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. మొత్తం 88 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యాధికారి గెడ్డం జ్యోతి తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ జాన్సీరాణి, పోలవరం ప్రాజెక్టు ఎస్ఇ నరసింహమూర్తి, సిఇ సుధాకర్‌బాబు, తహశీల్దార్ బి.సుమతి పరామర్శించారు. డిఎంహెచ్ఒ నాగేశ్వరరావు, డిసిహెచ్ఎస్ మోహన్‌రావు కార్మికులను పరామర్శించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి పలుసూచనలు చేశారు. డిసిహెచ్ఎస్ మోహన్‌రావు మాట్లాడుతూ.. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని, ఆహారం, నీరు శాంపిల్స్ సేకరించామని, వాటి పరీక్షల అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

సగం రోజులు ఓడీలోనే

- జనవరి 1 నుంచి ఇప్పటి వరకు 20 రోజులపాటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఖజానాకు ఓవర్‌డ్రాఫ్ట్ సమస్యలు వీడడం లేదు. ఈ నెలలో ఇప్పటి వరకు ప్రతి రోజూ ఓడిలోనే ఉండగా, ఈ త్రైమాసికంలో మొత్తం 20 రోజులు ఓవర్‌డ్రాఫ్ట్ రికార్డయ్యింది. జనవరి నుంచి ప్రారంభమైన చివరి త్రైమాసికంలో తొలి 40 రోజుల్లో ఏకంగా 20 రోజులపాటు ఓడిలో ఉండడం గమనార్హం. తాజాగా రూ.2,737 కోట్ల వరకు ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉండడం విశేషం.

ఇప్పటివరకు బయట నుంచి రుణాలు రాకపోవడం వల్లే ఓడికి వెళ్లాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు.వరుసగా 14 రోజులపాటు ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉండడం వల్ల ఖజానాపై ఆంక్షలుపడే ప్రమాదం ఉంటుంది. ఈ నెల 14వ తేదీతో ఈ పరిమితి ముగియనుంది. అందుకే అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర అధికారులకు రిజర్వు బ్యాంకు కూడా హెచ్చరికలు పంపినట్లు తెలిసింది.

సంపాదకీయం

పుస్తకాల పండుగ

గొప్ప గొప్ప వారందరూ గొప్ప పుస్తకాలు చదివినవారే...అంటారు. జాన్ రస్కిన్ 'అన్ టు దిస్ లాస్ట్' పుస్తకం గాంధీ, టాల్‌స్టాయ్‌ల జీవితాన్ని ప్రభావితం చేసింది. ఈ పుస్తకం చదవక ముందు గాంధీ వేరు, చదివిన తర్వాత గాంధీ వేరు. 'ఈ పుస్తకంలోని భావాలు దీపంలా నాలో వెలుగుని ప్రసారం చేశాయి. సర్వోదయాన్ని నాకు బోధించాయి' అని గాంధీ తన ఆత్మకథలో రాసుకున్నారు. ప్లేటో రాసిన 'రిపబ్లిక్', అరిస్టాటిల్ రాసిన 'పాలిటిక్స్', కారల్‌మార్క్స్ 'కాపిటల్' ప్రపంచాన్ని ప్రభావితం చేసిన గ్రంథాలు. డార్విన్ 'ఆరిజన్ ఆఫ్ స్పీసిస్' ప్రకృతి శాస్త్రంలో, మనిషి ఆలోచనా ధోరణిలో విప్లవం తెచ్చింది. 'వసుచరిత్ర' పుస్తకమంటే తనకు ప్రాణమంటారు కందుకూరి వీరేశలింగం. 'పుస్తకాలు మహా మనుషుల మస్తకాలు' అంటాడు కొడవటిగంటి తన 'చదువు' నవలలో. యువల్ నోవా హరారీ అనే ఇజ్రాయిల్ చరిత్రకారుడు రాసిన ప్రముఖ గ్రంథం 'సెపియన్స్ (మానవులు)'. మానవ జాతుల గురించి వివరించే ఈ పుస్తకాన్ని ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు చదివారు. చదవాల్సిందిగా సూచించారు. మేధావుల ఆలోచనలకు మనకున్న సాక్షి పుస్తకం. మానవ జీవన సాంస్కృతిక పరిణామ క్రమంలో పుస్తకాలు పోషించే పాత్ర అనిర్వచనీయం. 'ఈ ప్రపంచంలోకెల్లా అత్యంత అదృష్టవంతులు ఎవరైనా వున్నారంటే... పుస్తక పఠనం ద్వారా సంపూర్ణ ఆనందాన్ని పొందినవారే' అంటాడో తెలుగు నవలా రచయిత. పుస్తకం అంటే... కాగితాల దొంతరలు కాదు... మనిషిని మరో లోకంలోకి తీసుకెళ్లే శాటిలైట్. మనిషికి ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్నిచ్చేది... మహనీయుల భావజాలాన్ని, వారి వ్యక్తిత్వాన్ని మన కళ్ల ముందు ఆవిష్కృతం చేసేది పుస్తకమే. సాంకేతికంగా ఎంత అభివృద్ధి జరిగినా, ఎన్నటికీ మారనిది పుస్తకం.

టీవీ సీరియళ్లు, ఓటీటీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, మొబైల్, ఇంటర్నెట్, సోషల్ మీడియా వంటివి విలువైన సమయాన్ని హరించివేస్తున్నాయి. పుస్తక పఠనానికి దూరం చేస్తున్నాయి. 'ఇమ్ముగ చదువని నోరు.. కుమ్మరి మన్ను తవ్వినట్టి గుంటర సుమతీ' అంటాడు బద్దెన. పుస్తక పఠనం, సమాజ అధ్యయనం.. ఈ రెండింటి మేలుకలయిక వల్ల ఎందరో సామాన్యులు అసామాన్యులుగా చరిత్రకెక్కారు. సాంకేతికత పెరిగిన ఈ కాలంలో కూడా పుస్తకం తన ప్రాధాన్యతను నిలుపుకుంటూనే వుంది. 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో... కానీ, ఓ మంచి పుస్తకం కొనుక్కో' అంటారు కందుకూరి. ఇప్పుడీ ప్రస్తావన ఎందుకంటే... ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు విజయవాడలో పుస్తకాల పండుగ. ఈ పండుగ ఎక్కడ జరిగినా పుస్తక ప్రేమికులకు పసందైన విందే. ఆదియుగమైనా, ఆధునిక యుగమైనా జ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం ముఖ్య సాధనం. వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుంది. చాంధస, మూఢ విశ్వాసాల సంకెళ్ల నుంచి విముక్తి కలిగిస్తుంది. పుస్తక పఠనం జ్ఞాపకశక్తిని, పద సంపత్తిని పెంచుతుంది. 'కదిలేది కదిలించేది/ మారేది మార్పించేది/ పాడేది పాడించేది/ మునుముందుకు సాగించేది/ పెనునిద్దర వదిలించేది/ పరిపూర్ణపు బ్రతుకిచ్చేది' పుస్తకమే.

తరగతి గదిలో ఉపాధ్యాయుడు బోధించే విద్యకు... ఆన్‌లైన్ విద్య ఎలాగైతే ప్రత్యామ్నాయం కాజాలదో, అలాగే, ఏ సాంకేతికతా పుస్తకానికి ప్రత్యామ్నాయం కాలేదు. పెరిగిన సాంకేతికత వల్ల ఆన్‌లైన్‌లో కొన్ని అరుదైన పుస్తకాలు దొరకొచ్చు. ఇతర దేశాల్లోని సాహిత్యాన్ని అధ్యయనం చేసే అవకాశం వుండొచ్చు. కానీ, అందుబాటులో వున్న పుస్తకాన్ని కొనుక్కుని చదువుకోవడం, భద్రపర్చుకుని తర్వాతి తరానికి అందించడం అనే ప్రవాహానికి మిగతావేవీ ప్రత్యామ్నాయం కాదు. లండన్‌కి చెందిన ఆన్ మోర్గాన్ అనే పాత్రికేయురాలి బుక్‌షెల్ఫ్‌లో సుమారు 20 ఏళ్ల గొప్ప కలెక్షన్ వుంది. అవన్నీ ఇంగ్లీష్, నార్త్ అమెరికన్ పుస్తకాలే. ఇన్నేళ్లలో ఒక్క విదేశీ పుస్తకమైనా చదవలేకపోయానే అనుకుంది. ఐరాస గుర్తింపు పొందిన 193 దేశాలకు చెందిన ఒక్క పుస్తకమైనా చదవాలని, అది కూడా ఒక్క ఏడాదిలోనే చదవాలని సంకల్పించుకుంది. అలాంటి ఒక ఉక్కు సంకల్పం వుండాలి. జీవితాన్ని ఉత్సాహంగా గడపాలంటే... ఇంట్లో పుస్తకాలుండాలి. 'కొన్ని పుస్తకాలు రుచి చూడాలి. కొన్నింటిని మింగేయాలి. మరికొన్నింటిని నమిలి జీర్ణం చేసుకోవాలి' అంటాడు ప్రముఖ రచయిత బేకన్. పుస్తకాలు చదవడం అలవాటుగా మారాలి. ఈ పుస్తక పండుగను సద్వినియోగం చేసుకోవాలి. పిల్లలకూ అలవాటు చెయ్యాలి. సమాజంలోని అనేక రుగ్మతలకు ఇదే సరైన ఔషధం.

మహనీయుల మాట



మనకు రెండు రకాల విద్య అవసరం.
ఒకటి జీవనోపాధి
ఎలా కల్పించుకోవాలో నేర్పేది.
రెండవది ఎలా జీవించాలో నేర్పేది.
- ఓలే రోమర్

కామెంట్

ఉపాధి గురించి ఏం చెబుతారు మోడీజీ?

ప్రజల జీవితాలు, వారి జీవనోపాధులపై 2023-24 సంవత్సరం కేంద్ర బడ్జెట్ పెద్ద దాడి చేసింది. ప్రజలకు నేరుగా ఆర్థిక ప్రయోజనాలు అందించగల పథకాలు, కార్యక్రమాలపై వ్యయాన్ని దేశవ్యాప్తంగా తగ్గించివేశారు. అయితే, విస్మరించిన అంశాలు పెద్దవి, మరింత ఆందోళనకరమైనవి. ప్రజలు ఎదుర్కొనే కీలక సమస్యలను నిర్లక్ష్యం చేయడమో లేదా పట్టీపట్టనట్టు వ్యవహరించడమో చేశారు. వీటిలో ముఖ్యంగా యువతలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య వుంది. భారతదేశ జనాభాలో పనిచేయగలిగే యువత ఎక్కువగా వుందని గొప్పగా చెప్పుకునే అంశాన్ని ఇది నేరపూరితంగా నాశనం చేసింది.

గత 41 మాసాలుగా, నిరుద్యోగిత 7 శాతానికి పైగానే నమోదవుతూ వస్తోంది. ఒక్కోసారి అంతకంటే ఎక్కువే వుంటోందని సిఎంఐఇ సర్వే డేటా తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం నిరంతరంగా అధికంగానే వుంటోంది. 8-10శాతం మధ్య నమోదవుతోంది. ఇది ఏ మాత్రమూ ఆమోదయోగ్యం కాని అధిక రేటు. ప్రభుత్వ ఉదాసీనత, నిర్లక్ష్య ధోరణితో ఇదిలాగే స్థిరంగా కొనసాగుతూ వస్తోంది. గత మూడేళ్లలో చూసినట్లైతే, మొత్తంగా ఉద్యోగుల సంఖ్య స్తబ్దుగా వుంది. కరోనా మహమ్మారికి ముందు అంటే 2020 జనవరిలో 41.1 కోట్ల ఉద్యోగులు వుంటే 2023 జనవరి నాటికి కూడా 40.9 కోట్ల మంది వున్నారు. ఇదిలా వుండగా, ఇదే కాలంలో, కార్మిక ప్రాతినిధ్యం రేటు (పనిచేయగలిగే వయసులో వున్న వారి జనాభా వాటా అంటే పని చేయడమో లేదా ఉద్యోగాలు చూసుకుంటున్న వారి సంఖ్య) 42.9 శాతం నుండి 39.8 శాతానికి క్షీణించింది. ఈ విభిన్నమైన చర్యలు భయంకరమైన, బాధాకరమైన స్థితి గురించి మాట్లాడుతున్నాయి-జనాభా పెరుగుతున్నా ఉపాధి చేసే వారి సంఖ్య పెరగడం లేదు. పైగా కార్మిక ప్రాతినిధ్య రేటు తగ్గిపోతోందంటే మరింతమంది నిరాశా నిస్పృహలకు గురవుతున్నారని, లేబర్ మార్కెట్ నుండి బయటకు వెళ్ళిపోతున్నారని అర్థమవుతోంది. జీవన ప్రమాణాలు క్షీణిస్తున్నాయని తెలుస్తోంది.

అయితే, ఏడాదికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలు సృష్టించబడతాయని లేదా దాదాపు 10 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వ ఖాళీలు త్వరలో భర్తీ చేయబడతాయని ప్రభుత్వం, ప్రధాని ప్రజలకు హామీ ఇస్తున్నారు. అందువల్ల, రాబోయే సంవత్సరానికి ద్రవ్య విధానాన్ని నిర్దేశించిన కేంద్ర బడ్జెట్‌లో...కనీసం ఈ ఉద్యోగాల సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కొన్ని చర్యలనైనా ప్రకటిస్తారని ఆశించడం సహేతుకమే.

దీనికి భిన్నంగా, నిరుద్యోగితను ఎదుర్కొంటున్న వారికి కొంత ఉపశమనాన్ని కలిగించే ప్రస్తుతమున్న పథకాల్లో కొన్నింటికి నిధులను తగ్గించివేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) నిధులను 33 శాతం తగ్గించేశారు. 2022-23 (సవరించిన అంచనాల ప్రకారం)లో రూ.89,400 కోట్లు ఖర్చు పెట్టగా, 2023-24 సంవత్సరానికి రూ.60 వేల కోట్లకు కుదించేశారు. అలాగే, జాతీయ ఉపాధుల కార్యక్రమం (నేషనల్ లైవ్‌లీహుడ్స్ మిషన్) నిధులు కూడా గతేడాది బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే గణనీయంగా తగ్గిపోయాయి. ప్రత్యక్ష ఉపాధి పథకాల్లో ఈ కోతలతో పాటు....ఉద్యోగాలు సృష్టించబడతాయనుకున్న గ్రామీణ గృహ నిర్మాణ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, ఇతర సంక్షేమ పథకాలకు కూడా కోత పడింది. ఆచరణలో ఐసిడిఎస్ నిధుల్లో పెరుగుదల లేదు. అంటే మంజూరైన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల్లో 2.4లక్షల ఖాళీలు ఈ ఏడాది కూడా అలాగే కొనసాగుతాయని అర్థమవుతోంది. అలాగే ఇతర పథకాలకు మరీ ముఖ్యంగా చెప్పాలంటే ఇతర విభాగాలు,మంత్రిత్వ శాఖలకు సంబంధించినంతవరకు ఇదే పరిస్థితి నెలకొంది.



ఏడాదికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలు సృష్టించబడతాయని లేదా దాదాపు 10 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వ ఖాళీలు త్వరలో భర్తీ చేయబడతాయని ప్రభుత్వం, ప్రధాని ప్రజలకు హామీ ఇస్తున్నారు. అందువల్ల, రాబోయే సంవత్సరానికి ద్రవ్య విధానాన్ని నిర్దేశించిన కేంద్ర బడ్జెట్‌లో...కనీసం ఈ ఉద్యోగాల సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కొన్ని చర్యలనైనా ప్రకటిస్తారని ఆశించడం సహేతుకమే. దీనికి భిన్నంగా, నిరుద్యోగితను ఎదుర్కొంటున్న వారికి కొంత ఉపశమనాన్ని కలిగించే ప్రస్తుతమున్న పథకాల్లో కొన్నింటికి నిధులను తగ్గించివేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) నిధులను 33 శాతం తగ్గించేశారు. 2022-23 (సవరించిన అంచనాల ప్రకారం)లో రూ.89,400 కోట్లు ఖర్చు పెట్టగా, 2023-24 సంవత్సరానికి రూ.60 వేల కోట్లకు కుదించేశారు. అలాగే, జాతీయ ఉపాధుల కార్యక్రమం (నేషనల్ లైవ్‌లీహుడ్స్ మిషన్) నిధులు కూడా గతేడాది బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే గణనీయంగా తగ్గిపోయాయి. ప్రత్యక్ష ఉపాధి పథకాల్లో ఈ కోతలతో పాటు....ఉద్యోగాలు సృష్టించబడతాయనుకున్న గ్రామీణ గృహ నిర్మాణ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, ఇతర సంక్షేమ పథకాలకు కూడా కోత పడింది.

PEOPLE'S DEMOCRACY

ఈ బడ్జెట్‌లో ఉపాధి కల్పనా సామర్థ్యాల గురించి, గత విధానాల గురించి అనేక అసత్యాలను ప్రచారం చేయడంలో ప్రభుత్వం, దాని కీలక బాధ్యులు తలమునకలై వున్నారు. ఉద్యోగాలను సృష్టించగల మూల ధన వ్యయం కోసం మోడీ ప్రభుత్వం మరిన్ని మొత్తాలను కేటాయిస్తోందనేది వాటిల్లో ఒకటి. అయితే మౌలిక వసతుల కల్పన కోసం ఖర్చు పెట్టే దానికన్నా సామాజిక కేటాయింపులకు అంటే విద్య లేదా వైద్యం వంటి రంగాలపై ఖర్చు చేసినట్లైతే ఒక యూనిట్ ఖర్చుకు వచ్చే ఉద్యోగాలు మరిన్ని ఎక్కువగా వుంటాయన్నది ఇక్కడ అందరూ అంగీకరించగలిగిన, సుస్పష్టమైన వాస్తవంగా వుంది. అలాగే, మోడీ హయాంలో, విదేశీ యంత్రాల వంటి వాటిని మరింతగా దిగుమతి చేసుకోవడంలో మూల ధన వ్యయం ఇమిడి వుంది. అంటే దేశీయ ఉత్పత్తి, స్థానిక ఉద్యోగాలను పణంగా పెట్టి మూల ధన వ్యయంతో చేసుకునే దిగుమతులు పెరుగుతాయి.

పరిశ్రమలకు బ్యాంక్ రుణాలను సులభతరం చేయడం వల్ల ఉత్పాదక సామర్థ్యాలు విస్తృతమవుతాయని అంటే మరిన్ని ఉద్యోగాల సృష్టికి దారి తీస్తుందనేది మరో కట్టుకథ. గత కొన్నేళ్ళ అనుభవాలను చూసినట్లైతే కార్పొరేట్ రంగానికి ఇస్తున్న పలు రాయితీలు, మినహాయింపులు, సులభతరమైన రీతిలో రుణాలను అందించినా మరిన్ని ఉద్యోగాలు సృష్టించడంలో విఫలమయ్యాయి. కరోనా మహమ్మారి నెలకొన్న రెండేళ్ళలో లిస్టెడ్ కంపెనీల లాభాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. కానీ ఉపాధి కల్పన మాత్రం నిరాశపరిచే రీతిలోనే వుంది. ఇందుకు కారణమేంటనే వివరణ ఇవ్వడం చాలా తేలిక. నిరుద్యోగిత, తక్కువ ఆదాయాల కారణంగా ప్రజల్లో కొనుగోలు శక్తి తగినంతగా లేకుండా పోయింది. దానివల్ల వస్తువులు, సేవలకు డిమాండ్ తగ్గింది. అయితే రాయితీలు లేదా రుణాలనేవి ఉత్పత్తిని మరింత విస్తరించడానికి, మరింతమంది కార్మికులను తీసుకోవడానికి పరిశ్రమల యజమానులను ప్రలోభపెడతాయి. ఇటువంటి యజమానులకు ప్రభుత్వం రుణాల రూపంలో ఇచ్చే డబ్బంతా వారి లాభాల మార్జిన్‌ను మెరుగు పరుచుకోవడానికే ఉపయోగపడుతుంది.

మొట్టమొదటగా పెద్ద నోట్ల రద్దు, ఆ తర్వాత జిఎస్‌టి దెబ్బ, అటుపై కరోనా మహమ్మారి ఇలా వరుస దెబ్బలతో తీవ్రంగా ధ్వంసమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం (ఎంఎస్ఎంఇ) గురించి ఏం చెప్పుకోవాలి? ప్రస్తుత బడ్జెట్‌లో హామీ ఇచ్చిన తరహాలో ఈ రంగానికి సులభంగా రుణాలు అవసరం లేదా? భారతదేశంలో 6.33 కోట్ల ఎంఎస్ఎంఇల్లో 6.30 కోట్లు (99 శాతం) సూక్ష్మ సంస్థలే. 3.31 లక్షలు చిన్న తరహా యూనిట్లు, కేవలం 5వేలు మాత్రమే మధ్య తరహా సంస్థలు. సూక్ష్మ సంస్థల్లో దాదాపు 11 కోట్ల కార్మికులు వున్నారు. చిన్న తరహా సంస్థల్లో 32 లక్షల మంది వున్నారు. మధ్య తరహా సంస్థల్లో కేవలం 2 లక్షల కార్మికులే వున్నారు. కాబట్టి, ఎక్కువ ఉపాధిని సృష్టించేది సూక్ష్మ సంస్థలే. వీటికి నిధులు అవసరం. ఎంఎస్ఎంఇ రంగానికి ఉద్దేశించిన రుణంలో చాలా భాగం మధ్యతరహా సంస్థలకు వెళ్ళిపోతోంది. 2022 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఎంఎస్ఎంఇలకు ఇచ్చే రుణాలు చాలా తీవ్రంగా పెరిగాయి. చిన్న, మధ్య తరహా సంస్థలకు కలిపి రూ.2.57 లక్షల కోట్లు రుణాలు ఇవ్వగా, సూక్ష్మ సంస్థలకు కేవలం రూ.68.9 వేల కోట్లు మాత్రమే దక్కాయి. దీనంతటిని బట్టి స్పష్టమయ్యేదేమిటంటే నయా ఉదారవాద సిద్ధాంతం మత్తులో పడి మోడీ ప్రభుత్వ కళ్లుమూసుకుపోయాయి. బడా పెట్టుబడిదారుల-దేశీయ, విదేశీ- మీద అది పూర్తిగా ఆధారపడుతున్నది. వారిని ప్రోత్సహిస్తే ఆర్థిక వ్యవస్థకు వారే ఊపు తెస్తారని, ఉద్యోగ అవకాశాలు వాటంతటవే పెరిగిపోతాయన్నట్టుగా వ్యవహరిస్తున్నది. అసంభవమైన 'ట్రికిల్ డౌన్' సిద్ధాంతంపై దానికున్న నమ్మకమే ఉద్యోగ సంక్షోభ పరిష్కారంపై దృష్టిపెట్టకుండా దాని చేతులు కట్టిపడేస్తున్నది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తన విధానాలను సమూలంగా మార్చుకునేలా చేయడమో లేక వచ్చే ఎన్నికల్లో దానిని విసిరికొట్టడమో చేయాల్సిన అవసరముంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

జనవాక్యం

మళ్ళీ పెరిగిన వడ్డీ రేటు


భారత రిజర్వు బ్యాంకు మళ్ళీ అంటే సంవత్సరం తిరక్కుండానే ఆరో సారి రెపో రేట్ పెంచింది. ప్రస్తుతం 25 బేస్ పాయింట్లు పెరిగి వడ్డీ 6.5 శాతానికి చేరుకుంది. దీనివల్ల బ్యాంకులు రిజర్వ్ బ్యాంకు దగ్గర తీసుకునే అప్పులకు కట్టాల్సిన వడ్డీలు పెరుగుతాయి. ఆ వడ్డీల్ని ఋణం తీసుకునే ఖాతాదారుల జేబు నుండి కక్కిస్తాయి. వెరసి ఇంటి రుణం వాయిదాలతో సహా కొత్త రుణాలూ, పాతవీ అన్నీ ప్రియమౌతాయి. తద్వారా నగదు చలామణీ కట్టడి జరిగి ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుందని ఆశ. ద్రవ్యోల్బణం అదుపు చెయ్యడానికి ఇది శాస్త్రీయ మార్గమే అయినప్పటికీ, ప్రజల్ని బాదే ఈ మార్గమే ఏకైక మార్గంగా కనబడడం బాధాకరం. రిజర్వు బ్యాంకు దాని లెక్కల్లో అది ఉన్నా ప్రజలకు ఉపశమనం కలిగించడానికి అందుబాటులో ఉన్న మిగతా మార్గాల్ని ప్రభుత్వం చూడాలి. ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి, ఉపాధి పెంచడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించాలి. ద్రవ్యోల్బణం పెరుగుతూ పోవడానికి డిమాండ్ పెరగడమే కాకుండా సరఫరా తగ్గడమూ పెద్ద కారణమే. చేతిలో లేని అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా వాటిని దిద్దడం ఇప్పటికిప్పుడే సాధ్యం కాకపోవచ్చు. ముడి చమురు ధరలు, మార్కెట్ ఒడిదుడుకులు ఇంకా పెరిగి భారం కావొచ్చు. అయితే ఉన్నంతలో ప్రభుత్వం ఎంత చెయ్యగలిగిందన్నదే ప్రధానం. మొన్న బడ్జెట్ ప్రసంగంలో మిగతా దేశాల ఆర్థికం కరోనాతో కుదేలైతే, మన దేశం మాత్రం నిలిచి కోలుకుందని ఆర్థిక మంత్రి చెప్పారు. వైద్య, విద్యా రంగాలకు పెద్దగా కేటాయింపులు లేవు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కోత. ఇప్పుడు బ్యాంకుల వడ్డీలు పెరిగి చేతిలో డబ్బు ఆడడం ఇంకొంచెం కష్టం కాబోతుంది. ద్రవ్యోల్బణం 6.5 శాతానికి కట్టడి చెయ్యగలం అంటున్నారు. చూడాలి మరి.

- డా.డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

మీ రచనలను
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

విశ్లేషణ

పెన్షన్ సరుకు కాదు ..హక్కు...



ఎన్.వెంకటేశ్వర్లు

ప్రభుత్వ సేవలో నిమగ్నమైన ఉద్యోగికి వయసు మళ్ళిన తర్వాత ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వం ఇచ్చేదే పెన్షన్. బ్రిటిష్ కాలం నుండి 1950 వరకు పెన్షన్ ఇవ్వటం అనేది ప్రభుత్వాలు బాధ్యతగా చేస్తూ వున్నాయి. 1951లో పోరాటాల ఫలితంగా పెన్షన్ గ్యారెంటీ స్కీం ప్రవేశపెట్టబడింది. ప్రభుత్వాలు నిర్ధారించిన కొంత మొత్తంలో పెన్షన్ ఇచ్చేవారు. 1982లో సుప్రీంకోర్టు 'పెన్షన్ భిక్ష కాదు. హక్కు. ఇది ఉద్యోగి సామాజిక భద్రత' అని తీర్పు ఇచ్చిన తర్వాత ట్రిబుల్ బెనిఫిట్ స్కీమ్ అమలులోకి వచ్చింది. పిఆర్‌సి లో స్కేళ్లు మారినప్పుడల్లా పెన్షన్‌లో మార్పులు రావడం, ఉద్యోగి చరమాంకంలో అత్యంత గౌరవప్రదమైన భృతిగా ఉపయోగపడుతుంది. జనవరి 2004 తర్వాత అపాయింట్ అయిన ఉద్యోగికి న్యూ పెన్షన్ స్కీం పేరుతో, షేర్ మార్కెట్ ఆధారిత పెన్షన్, గ్యారెంటీ లేని పెన్షన్, మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి తీసుకునే పెన్షన్‌గా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఉద్యోగి సామాజిక భద్రత కోసం ప్రభుత్వమే ఇవ్వాల్సిన పెన్షన్‌ని మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీదికి ఎందుకు వదిలిపెట్టింది? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ బాధ్యత నుండి ఎందుకు తప్పుకుంటున్నాయి? పెన్షన్ అనేది నిజంగానే ప్రభుత్వానికి భారంగా మారిందా? పెన్షన్ ప్రభుత్వం ఇస్తే ఆర్థిక వ్యవస్థ అంధకారం అవుతుందా? పెన్షన్ ఉద్యోగి కొనుక్కోవలసిన (సరుకా) సాధనమా? పెన్షన్ హక్కు కాదా? ఇలాంటి ప్రశ్నలు వస్తున్నాయి.

వస్తువు-సరుకు

తన అవసరాల కోసం ఉత్పత్తి చేసుకునేది వస్తువు. మార్కెట్లో క్రయవిక్రయాల కోసం ఉపయోగించేది సరుకు. సరుకు అనే భావన లాభనష్టాల గురించి మాట్లాడుతుంది తప్ప, బాధ్యత గురించి, సామాజిక అంశాల గురించి, ఆ మాటకొస్తే మానవత్వం గురించి మాట్లాడదు. 1947 నుంచి 1980 వరకు భారతదేశంలో సంక్షేమ రాజ్యం అమల్లో ఉంది. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు, ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు, ప్రభుత్వ రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రభుత్వమే అమలు చేసింది. 1980 తరువాత భారతదేశంలో ఆర్థికమాంద్యం ఏర్పడింది. విదేశీ మారక నిల్వలు కరిగిపోవడం, బంగారాన్ని సైతం కుదువ పెట్టాల్సి రావడం, అప్పుల కోసం ప్రపంచ దేశాల మీద ఆధార పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఈ నేపథ్యంలో భారతదేశం అప్పు కోసం ప్రపంచ బ్యాంకు తలుపు తట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ బ్యాంక్ షరతులకు లోబడి తెచ్చుకున్న అప్పు ఫలితంగా ప్రభుత్వం సంక్షేమ బాధ్యత నుంచి పక్కకు తప్పుకోవటం, ప్రజలకు కావలసిన ప్రతి అవసరం కొనుక్కోవటం (అంటే సరుకుగా మారిపోవటం) ప్రారంభమైంది. 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటి వరకు 32 సంవత్సరాల కాలంలో ప్రతిదీ సరుకుగా మారిపోయింది. ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా మారిపోయింది. ఆఖరికి ప్రభుత్వ రంగ కంపెనీలను అమ్మడం కోసం, కార్పొరేట్లకు అప్పచెప్పటం కోసం కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేసింది.



ప్రపంచంలో ఏర్పడిన ఆర్థికమాంద్యం వల్ల కార్పొరేట్లకు అవసరమైన పెట్టుబడుల వెతుకులాటలో వుండగా.... భారతదేశ ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పాటు ప్రభుత్వం దగ్గర ఉన్న వివిధ రకాల నిల్వలు, పెన్షన్ ఫండు నిల్వల మీద ప్రపంచ బ్యాంక్ కన్ను పడింది. పరిశ్రమలతో పాటు ఈ దేశంలో ఉన్న సహజ సంపదల మీద కూడా ప్రపంచ బ్యాంకు చూపు పడింది. అప్పుకెళ్లిన ప్రతిసారీ సంస్కరణల పేరుతో ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుని ప్రైవేటు రంగానికి కేటాయింపులు చేసేందుకు ఒత్తిడి తేసాగింది. దీనిలో భాగంగానే ప్రజలకిచ్చే సబ్సిడీలపై కోతను విధిస్తోంది. ధరలు పెంచుతోంది. రైతాంగ వ్యతిరేక చట్టాలు తెస్తోంది. కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్స్‌గా మార్చేసింది. కార్పొరేట్లకు ఏ కొద్దిపాటి నొప్పి తగలకుండా జాగ్రత్త పడుతోంది. ఎలాంటి పోరాటాలు జరగకుండా నిర్బంధాలు ప్రయో గిస్తోంది. గతంలో ప్రజలకి... ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హక్కులన్నిటిని ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకుంటోంది. దానిలో భాగంగానే హక్కుగా ఉన్న పెన్షన్ని కాంట్రిబ్యూషన్ పెన్షన్‌గా మార్చింది. అంటే దేశంలో ప్రతిదీ సరుకుగా మాత్రమే అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వం కార్పొరేట్లకు కావాల్సిన నిధులు సేకరించే పని చేస్తుందన్నమాట.

ప్రతిదీ మానెటైజేషన్

భూమి, గనులు, రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, గాలి, నీరు, పాలు... ఒక్కటేమిటి ఇప్పటి వరకు సహజ సంపదలుగా, ప్రభుత్వ రంగ సంస్థలుగా ఉన్న అన్నీ... ప్రైవేటు సేవలుగా మారుతున్నాయి. అన్ని రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకొని, కార్పొరేట్లకు ఇచ్చేయడం ప్రారంభించింది. 400 రైల్వే స్టేషన్లు, 90 ప్యాసింజర్ రైళ్లు, 1400 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్, 15 రైల్వే స్టేడియంలు, 265 రైల్వే గూడ్స్ షెడ్లు మానిటైజేషన్ చేస్తున్నారు. 35 వేల కోట్ల విలువ కలిగిన టెలికం ఆస్తులు, 28, 747 కోట్ల విలువ చేసే బొగ్గు గనులు, 761 ఖనిజ బ్లాక్స్, 12,828 కోట్ల షిప్పింగ్ అసెట్ల వేలం, 25 విమానాశ్రయాల మానెటైజేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల భవిష్యత్తులో విమానాశ్రయం గేటు దగ్గరికి వెళ్ళినా రైల్వే స్టేషన్‌కి పోయినా బస్ స్టేషన్‌కు పోయినా ఆఖరికి ప్రభుత్వ పార్కుల్లోకి పోయినా యూజర్ చార్జీల పేరుతో వందలాది రూపాయలు వసూలు చేసే పని జరుగుతున్నది. ఎంటర్‌టైన్ మెంట్‌కు కూడా రుసుము చెల్లించాల్సిన పరిస్థితి. ప్రతిదాన్నీ ప్రభుత్వం సరుకుగా మార్చివేస్తున్నది.

ప్రజల పక్షాన నిలబడటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. దీనికి భిన్నంగా కార్పొరేట్లకు, మార్కెట్ శక్తులకు లాభాన్ని చేకూర్చే విధానాన్ని అమలు చేసే వైపు ప్రభుత్వాలు నిలబడటం సరికాదు. కార్పొరేట్ల వైపు నిలబడితే ప్రతిదీ భారంగానే మారుతుంది. రోడ్లు వేయటం, ప్రాజెక్టులు కట్టడం, పరిశ్రమలు స్థాపించడం, రైల్వే, ఎల్ఐసి, పోస్టల్, టెలికం రంగాల నిర్వహణ అన్నీ భారంగానే మారతాయి. దానితో పాటు సామాజిక భద్రతను ఇచ్చే పెన్షన్ కూడా భారంగానే మారుతుంది. కనుక ప్రభుత్వాలు కార్పొరేట్లకు లాభం చేకూర్చే వైపు కాకుండా ప్రజల సంక్షేమం వైపు ఆలోచిస్తే...పెన్షన్ సరుకు కాదు. సామాజిక భద్రతను ఇచ్చే ఆసరాగా మారుతుంది.

పెన్షన్ కోసం పోరాటం

ఒకటే సర్వీస్ ఒకటే పెన్షన్ నినాదంతో సైనికులు పెన్షన్ కోసం పోరాడుతున్నారు. 2004 తర్వాత అపాయింట్ అయిన ప్రభుత్వ ఉద్యోగులు నూతన పెన్షన్ విధానం వద్దు, పాత పెన్షన్ విధానమే అవసరం అనే డిమాండ్‌తో పెద్ద ఎత్తున కార్యక్రమాలు, పోరాటాలు చేస్తున్నారు. ఎల్ఐసి, పోస్టల్, రైల్వే...ఇలా అన్ని రంగాల వారు పెన్షన్ భిక్ష కాదు హక్కు అని పెద్ద ఎత్తున పెన్షన్ కోసం పోరాడుతున్నారు. ప్రతిదీ సరుకు చేస్తున్న ప్రభుత్వం పెన్షన్‌ని కూడా సరుకుగా మారుస్తున్నది. 10 శాతం కంట్రిబ్యూషన్‌తో పెన్షన్‌ని కొనుక్కోమని చెబుతున్నది. ప్రభుత్వం కడుతున్న 10 శాతం కాంట్రిబ్యూషన్‌ని కట్టకుండా ఎగనామం పెడుతున్నది. ఇలా సమీకరించబడ్డ 20 శాతం ఫండ్లు ప్రభుత్వం తన ఖాతాలో ఏమైనా ఉంచుతుందా అంటే అదీ లేదు. షేర్ మార్కెట్లో కార్పొరేట్ శక్తులకు అందుబాటులో ఉంచుతుంది.

పెన్షన్ ప్రభుత్వానికి భారమా...

ఉద్యోగ, ఉపాధ్యాయులకి ప్రభుత్వాలు పెన్షన్ ఇస్తే ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ దివాలా తీస్తుందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. ఇక మన రాష్ట్ర ప్రభుత్వం అయితే 2100 సంవత్సరానికి పెన్షన్లు అత్యంత భారమైపోతాయని, ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో ఎక్కువ శాతం పెన్షన్‌కి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ప్రజల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని చెప్తోంది. 2023-24 బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం పెన్షన్ల కోసం 14 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేస్తున్నామని చెప్పింది. పెన్షన్ వల్లే ఆర్థిక లోటు ఏర్పడుతుందని చెప్పేది నిజమా లేక 14 శాతం నిధులే ఖర్చు అని చెప్పేది నిజమా. పెన్షన్ ప్రభుత్వానికి భారం కాదు. ఇది ఒక సామాజిక భద్రత కోసం కేటాయించే నిధులు.నిజంగా ఆర్థిక వ్యవస్థ ఇబ్బందులలో ఉంటే గడచిన ఐదు సంవత్సరాలలో రూ.13 లక్షల కోట్లు కార్పొరేట్లకు ఎలా రాయితీలు ఇచ్చారు? 5జి స్పెక్ట్రమ్ పేరుతో రూ.2 లక్షల 75 వేల కోట్లు ఎలా సబ్సిడీ ఇచ్చారు? అదానీ ఆదాయం 750 శాతం, అంబానీ ఆదాయం 350 శాతం ఎలా పెరిగింది? నీరవ్ మోడీ లాంటి వారి అప్పులు ఎందుకు తిరిగి రాబట్టలేకపోయారు? ఈ డబ్బులన్నీ ప్రజల సంక్షేమం కోసం, ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ కోసం కేటాయిస్తే పెన్షన్ భారం కాదు.

ప్రభుత్వ వైఖరి మారాలి

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని చూడాలి. ప్రజల కష్టాల్ని, భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వ ధనాన్ని వెచ్చించాలి. పన్నుల భారం నుండి, అధిక ధరల నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ప్రజలకి ప్రభుత్వానికి వారధిగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హక్కుల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రజల్లో ఏదైనా అంశం మీద అసంతృప్తి ఏర్పడితే దాన్ని చర్చల ద్వారా తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. వినటం ప్రజాస్వామ్యంలో ఒక గొప్ప లక్షణం. వినకపోవడం ఎలాంటి ప్రజాస్వామ్యం? ప్రజల పక్షాన నిలబడటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. దీనికి భిన్నంగా కార్పొరేట్లకు, మార్కెట్ శక్తులకు లాభాన్ని చేకూర్చే విధానాన్ని అమలు చేసే వైపు ప్రభుత్వాలు నిలబడటం సరికాదు. కార్పొరేట్ల వైపు నిలబడితే ప్రతిదీ భారంగానే మారుతుంది. రోడ్లు వేయటం, ప్రాజెక్టులు కట్టడం, పరిశ్రమలు స్థాపించడం, రైల్వే, ఎల్ఐసి, పోస్టల్, టెలికం రంగాల నిర్వహణ అన్నీ భారంగానే మారతాయి. దానితో పాటు సామాజిక భద్రతను ఇచ్చే పెన్షన్ కూడా భారంగానే మారుతుంది. కనుక ప్రభుత్వాలు కార్పొరేట్లకు లాభం చేకూర్చే వైపు కాకుండా ప్రజల సంక్షేమం వైపు ఆలోచిస్తే...పెన్షన్ సరుకు కాదు. సామాజిక భద్రతను ఇచ్చే ఆసరాగా మారుతుంది. ప్రభుత్వాలు ఈ దిశగా ఆలోచించేట్లు మనం పోరాటం చేయాలి. కార్పొరేట్లకు లాభాలను చేకూర్చే సిపిఎస్ లేదా జిపిఎస్‌కి వ్యతిరేకంగా ఉద్యమించాలి. పాత పెన్షన్ కోసం నిలబడాలి.

/ వ్యాసకర్త యు.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు /

★

రాబోయే ఎన్నికల్లో ఆర్‌జెడి, జెఎంఎం కలిసి పోటీ



రాంచి : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఆర్‌జెడి, జెఎంఎం కలిసి పోటీ చేస్తాయని బీహార్ డిప్యూటీ ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ చెప్పారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో శనివారం తన నివాసంలో సమావేశం అనంతరం తేజస్వి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్ళు గురించి, రాబోయే ఎన్నికల్లో కలిసి పోటీ చేయడంపై ఇరువురం మాట్లాడుకున్నామని తెలిపారు. జార్ఖండ్‌లో పార్టీ కార్యకలాపాలను సమీక్షించాలన్న ఆర్‌జెడి ఆలోచనల గురించి కూడా తేజస్వి చెప్పారు. లాలూ అనారోగ్యంతో గతంలో అనుకున్న కొన్ని కార్యకలాపాలు నిలిచిపోయాయని, కానీ ఇప్పుడు ఆయన ఆరోగ్యం బాగవడంతో మళ్లీ అన్ని కార్యక్రమాలు సజావుగా జరుగుతాయని భావిస్తున్నట్లు చెప్పారు. జార్ఖండ్‌లో మహాగత బంధన్ కూటమిని బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామన్నారు. చవకబారు రాజకీయాలకు పాల్పడుతున్న బిజెపి ఓటర్లను కొనుగోలు చేసేందుకు యత్నిస్తోందన్నారు.



త్రిపురలో మోడీ ప్రచారం

అంబాసా : పార్లమెంటులో ప్రతిపక్షాలు సంధించిన ప్రశ్నలకు కానీ, దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు కానీ ఏ మాత్రం సమాధానం చెప్పకుండా ఎదురుదాడి సాగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ..త్రిపురలో ఎన్నికల ప్రచార సభలోనే అదే తీరుతో ప్రసంగించారు. రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలకు చేసిన మేళ్లు ఏమిటో చెప్పకుండా గత ప్రభుత్వాలపై దుమ్మెత్తి పోయడమే లక్ష్యంగా ఆయన ప్రసంగం సాగింది. త్రిపుర ఎన్నికల సందర్భంగా ధలాయ్ జిల్లాలోని అంబాసాలో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. త్రిపురలో ఏళ్ళ తరబడి వారి పాలన వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారంటూ ప్రధాని మోడీ పేర్కొన్నారు. గిరిజనుల్లో గత ప్రభుత్వాలు చీలికలను సృష్టించాయని, కానీ బిజెపి మాత్రం వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. ఈ రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడకుండా వుండాలంటే బిజెపికే ఓటు వేయాలని కోరారు.

నగలు వేసుకొని విధులకు రావొద్దు

- హర్యానా వైద్య సిబ్బందికి కొత్త డ్రెస్‌కోడ్

ఛండీగఢ్ : హర్యానా రాష్ట్ర ప్రభుత్వం వైద్య సిబ్బందికి కొత్త డ్రెస్ కోడ్ అమల్లోకి తీసుకొచ్చింది. నూతన నియమావళి ప్రకారం..వైద్య సిబ్బంది ఎవ్వరూ ఇక నుంచి నగలు ధరించి కానీ, ప్రత్యేక మేకప్ వేసుకొని విధులకు హాజరు కారాదు. అలాగే ఫంకీ హెయిర్‌స్టైల్ చేసుకోరాదు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగుల్లో క్రమశిక్షణ, ఏకత్వం, సమానత్వం కోసమే నూతన డ్రెస్‌కోడ్ పాలసీని అమల్లోకి తీసుకొచ్చామని హర్యానా ఆరోగ్య శాఖ మంత్రి అనిల్ విజ్ తెలిపారు. 'ఆసుపత్రి పనివేళల్లో.. స్కర్టులు ధరించరాదు. అసాధారణ హెయిర్ స్టైళ్లతో విధులకు రాకూడదు. టీషర్టులు, జీన్స్‌లు, స్కర్టులు, లెదర్ ప్యాంట్లు, క్రాప్‌టాప్‌లను అనుమతించబోం. ఫార్మల్ దుస్తులనే ధరించాలి' అని అనిల్ విజ్ తెలిపారు.

ఎయిర్ ఏసియాకు రూ.20లక్షల జరిమానా

ముంబయి : ఎయిర్ ఏసియా విమానయాన సంస్థకు డైరెక్టరేట్ ఆఫ్ జనరల్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) భారీ జరిమానా విధించింది. పైలెట్ల శిక్షణలో వైఫల్యం చెందినందుకు రూ.20 లక్షల జరిమానా వేసింది. అంతర్జాతీయ పౌర విమానయాన రెగ్యులేటరీ నిబంధనల ప్రకారం విమానాన్ని నడిపే పైలట్‌కు సామర్థ్య పరీక్షలు నిర్వహించేటప్పుడు కొన్ని కచ్చితమైన చర్యలు పాటించాలి. వాటిని పాటించడంలో ఆ సంస్థ వైఫల్యం చెందిందని డిజిసిఎ పేర్కొంది. డిజిసిఎ నిబంధనల మేరకు విధులు నిర్వహించడంలో అలసత్వం ప్రదర్శించిన ఎయిర్‌లైన్స్ శిక్షణ విభాగ అధిపతిని మూడు నెలల పాటు తొలగిస్తూ చర్యలు తీసుకుంది. అలాగే ఎనిమిది మంది సూపర్‌వైజర్లకు రూ.3 లక్షల చొప్పున జరిమానా వేసింది. ఈ అంశంలో ఏయిర్ ఆసియాకు నోటీసులు జారీ చేసింది.

బెంగళూరులో అనుమానాస్పద ఉగ్రవాది అరెస్టు

బెంగళూరు : ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్)తో సంబంధాలున్నట్లు అనుమానిస్తూ బెంగళూరు ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మహమ్మద్ ఆరీఫ్‌ను అరెస్టు చేశారు. అంతర్గత భద్రత విభాగం (ఐఎస్‌డి), జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో శనివారం ఉదయం అతడిని అదుపులోకి తీసుకున్నారు. త్వరలోనే సిరియాకు వెళ్లి ఉగ్రవాద సంస్థలో చేరేందుకు నిందితుడు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. గత రెండేళ్లుగా ఒక ప్రయివేటు ఐటి సంస్థలో వర్క్ ఫ్రం హోం కింద పనిచేస్తున్న ఆరీఫ్ తానిసంద్రలో నివాసముంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఐఎస్ఐఎస్‌కు సంబంధించిన పేజీల్లో ఆరీఫ్ క్రియాశీలంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆరీఫ్ నుంచి ఒక ట్యాబ్‌ని, ల్యాప్‌ట్యాప్‌ని స్వాధీనం చేసుకున్నారు.

రాజ్యాంగ లక్ష్యాల సాధనకు కృషి

- ఇది పౌరులందరి బాధ్యత
- మహారాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో జస్టిస్ చంద్రచూడ్



మహారాష్ట్ర జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ తొలి స్నాతకోత్సవ వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న జస్టిస్ చంద్రచూడ్

ముంబయి : భారత రాజ్యాంగ పీఠికలో మనకు మనం నిర్దేశించుకున్న 'అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం' లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కోరారు. రాజ్యాంగ లక్ష్యాల సాధన అనేది దేశ పౌరులందరి బాధ్యత అని ఆయన నొక్కి చెప్పారు. శనివారం నాగ్‌పూర్‌లోని మహారాష్ట్ర జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగించారు. "అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సాధించాలి" అంటూ పీఠికలో పేర్కొన్న వాగ్దానాన్ని నెరవేర్చడానికి పౌరులుగా ప్రతి ఒక్కరం పాటు పడాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగమనేది స్వపరిపాలన, గౌరవం, స్వాతంత్ర్యం యొక్క అత్యద్భుతమైన స్వదేశీ ఉత్పత్తిగా ఆయన అభివర్ణించారు. కానీ కొందరు దీనిపై పూర్తిగా ద్వేషపూరితమైన రీతిలో మాట్లాడుతుంటే, చాలామంది భారత రాజ్యాంగం సాధించిన విజయం గురించి విరక్తిగా మాట్లాడతారని అన్నారు. కానీ ఈ రెండింట్లోనూ వాస్తవికత లేదని అన్నారు. భారతదేశ వలసవాద నాయకులు మనపై రాజ్యాంగాన్ని రుద్దలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. మన రాజ్యాంగమనేది ఎలా ఆవిర్భవించిందో ఆ కోణంలో నుండి చూసినట్లైతే, అదొక అత్యద్భుతమైన అంశంగా గుర్తిస్తారని ఆయన స్పష్టం చేశారు. చేయాల్సిన పనులు ఇంకా చాలా వున్నప్పటికీ రాజ్యాంగం చేసిన పనులు, కృషి కూడా చాలా వుందని అన్నారు. యువ న్యాయ విద్యార్థులు, న్యాయ పట్టభద్రులు రాజ్యాంగ విలువల మార్గదర్శకత్వంతో వృత్తి జీవితంలో ముందుకు సాగినట్లైతే వారెన్నటికీ విఫలమవరని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పీఠిక గురించి ప్రస్తావిస్తూ, చిన్నదిగానే వున్నా రాజ్యాంగానికి ఇది బరువును చేకూర్చిందన్నారు. భారత ప్రజలుగా మనం ఈ రాజ్యాంగానికి కట్టుబడి వుండాలని ఆకాంక్షించారు. ఈనాడు అత్యంత సులభంగా మనం అనుభవిస్తున్న రాజ్యాంగ హక్కులు, సౌకర్యాలకు గానూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు మన భారతీయులందరం రుణపడి వున్నామన్నారు.

ఢిల్లీలో తెరపైకి మరో వివాదం

- డిస్కమ్‌ల బోర్డు నుంచి ఆప్ ప్రతినిధుల తొలగింపు
- లెఫ్టినెంట్ గవర్నరు నిర్ణయంపై ఆమాద్మీ ఆగ్రహం
- ఇది రాజ్యాంగ ఉల్లంఘనేనని విమర్శ



న్యూఢిల్లీ : ఢిల్లీలోని అధికార ఆమాద్మీ పార్టీకి, లెఫ్టినెంట్ గవర్నరు వికె సక్సేనాకు మధ్య మరో వివాదం రాజుకుంది. కేంద్రంలోని మోడీ సర్కార్‌కు కీలుబొమ్మలా బిజెపి అజెండాను ఢిల్లీలో బలవంతంగా రుద్దేందుకు సక్సేనా ప్రయత్నిస్తున్నారంటూ ఇప్పటికే పలు అంశాల్లో ఆయన జోక్యాన్ని ఆప్ నిరసించిన సంగతి విదితమే. తాజాగా ఆప్ కేబినెట్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా లెఫ్టినెంట్ గవర్నరు నిర్ణయం తీసుకున్నారు. ప్రయివేటు డిస్కమ్‌ల బోర్డు సభ్యులుగా ఉన్న ఆప్ అధికార ప్రతినిధి జాస్మిన్ షా, ఆప్ ఎంపి ఎన్‌డి గుప్తా కుమారుడు నవీన్ ఎన్‌డి గుప్తాను ఆయన తొలగించారు. గవర్నర్ తీసుకున్న ఈ నిర్ణయం రాజ్యాంగ ఉల్లంఘనేనని, చట్టానికి విరుద్ధమని ఆప్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యుత్‌పై ఉత్తర్వులు జారీ చేసే అధికారం ఎన్నికైన ప్రభుత్వానికే ఉంటుందని, గవర్నర్‌కి ఉండదని ఆప్ విమర్శిస్తోంది. గవర్నర్ సక్సేనా సుప్రీంకోర్టు ఆదేశాలను తోసిపుచ్చుతున్నారని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని ఈ సందర్భంగా ఆప్ నేత, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి ఉండే హక్కులను గవర్నరు కాలరాస్తున్నారని వాపోయారు. కాగా, బివైపిఎల్, బిఆర్‌పిఎల్ (అనీల్ అంబానీ), ఎన్‌డిపిడిసిఎల్ (టాటా) బోర్డుల్లో ప్రభుత్వ నామినీలుగా ఉన్న జాస్మిన్, నవీన్ గుప్తా.. రాష్ట్ర ఖజానా ఖర్చుతో ప్రైవేటు డిస్కమ్‌లకు ఆర్థిక ప్రయోజనాలను అందించారని విద్యుత్ బోర్డు ప్రధాన కార్యదర్శి అందించిన నివేదిక ఆధారంగా లెఫ్టినెంట్ గవర్నర్ బోర్డు సభ్యులుగా ఉన్న వారిని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారని ఆయన కార్యాలయం పేర్కొంది. అలాగే అనీల్ అంబానీ యాజమాన్యంలోని డిస్కమ్‌ల బోర్డులలో జాస్మిన్, నవీన్ గుప్తా ప్రైవేట ప్రతినిధులకు సహకరించి.. 8 వేల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చారని లెఫ్టినెంట్ గవర్నర్ పేర్కొన్నారు. ఇక ఆ ఇద్దరి బోర్డు సభ్యుల స్థానంలో వేరొకరిని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం నామినేట్ చేసేంతవరకు సీనియర్ ప్రభుత్వ అధికారులను నియమించడం ఆనవాయితీ అని సక్సేనా తెలిపారు.




గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖపట్నంలో మార్చి 3, 4న జరిగే ఎపి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు రావాలని పలువురు కేంద్ర మంత్రులను రాష్ట్ర మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ఆహ్వానించారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను వారివారి కార్యాలయాల్లో కలిసి బుగ్గన ఆహ్వానాలు అందజేశారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమ్మిట్‌లో పాల్గొనాలని కోరారు.

ప్రజాస్వామ్య బలోపేతానికి చర్చలు

- అమెరికాలో లూలా పర్యటన
- బైడెన్‌తో భేటీ



వాషింగ్టన్ : ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై, వాతావరణ మార్పులపై ప్రధానంగా దృష్టి సారించి చర్చలు జరిపేందుకు బ్రెజిల్ అధ్యక్షులు లూలా డ సిల్వా అమెరికాలో పర్యటిస్తున్నారు. వైట్‌హౌస్‌కు లూలాను ఆహ్వానించిన అమెరికా అధ్యక్షులు జోయ్ బైడెన్ ఆయనతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో విజయాలు సాధించినా పదవీచ్యుతులను చేసేందుకు స్వదేశాల్లో జరిగిన మితవాద శక్తుల కుట్రలను ఇరువురు నేతలు ఎదుర్కొన్నారు. వాటిపై తమ అనుభవాలను ఇరువురు పంచుకున్నారు. 'పటిష్టమైన ప్రజాస్వామ్యాలు కలిగిన రెండు దేశాలు కాలపరీక్షలకు నిలిచాయి' అని ఓవల్ ఆఫీసులో సమావేశానికి ముందు బైడెన్ వ్యాఖ్యానించారు. కానీ ఈ రెండు దేశాల్లో ప్రజాస్వామ్యం ప్రబలంగా నిలిచిందని అన్నారు. తిరిగి బ్రెజిల్ స్థానాన్ని ప్రపంచ వేదికపై పునరుద్ధరించాలన్నది తన లక్ష్యమని, ఆ దిశగా కృషి చేస్తున్నామని లూలా చెప్పారు. నాలుగేళ్ళ పాటు బ్రెజిల్ పక్కకు నెట్టివేయబడిందన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య, హైతిలో అభద్రత, వలసలు, వాతావరణ మార్పులు, అమెజాన్‌లో అడవుల నరికివేతను అడ్డుకోవడానికి చర్యలు వంటి పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. బ్రెజిల్‌లో విద్వేష సంస్కృతి లేదని సిఎన్ఎన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒక ప్రశ్నకు సమాధానంగా లూలా చెప్పారు. స్వదేశంలో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కుట్రలు పన్నిన మితవాద నాయకుడు జేర్ బోల్సోనారోని అప్పగించాల్సిందిగా కోరతారా అని ప్రశ్నించగా, వ్యక్తిగతంగా తాను ఆ విషయాలు మాట్లాడాలనుకోవడం లేదని లూలా స్పష్టం చేశారు. అవసరమైతే బ్రెజిల్ న్యాయ వ్యవస్థ ఆ విషయం చూసుకుంటుందని అన్నారు.



తూర్పు జర్మనీ చివరి కమ్యూనిస్టు నేత హన్స్ మొద్రో కన్నుమూత

బెర్లిన్ : తూర్పు జర్మనీ చిట్టచివరి కమ్యూనిస్టు నేత హన్స్ మొద్రో (95) శనివారం తెల్లవారు జామున కన్నుమూశారని వామపక్ష పార్లమెంటరీ గ్రూపు తెలియచేసింది. సంస్కరణలవాదీ అయిన మొద్రో బెర్లిన్ గోడ కూలిన వెంటనే తూర్పు జర్మనీ పాలనా బాధ్యతలు చేపట్టారు. తర్వాత ప్రభుత్వంలోకి చేరాల్సిందిగా ప్రతిపక్ష శక్తులను కూడా ఆహ్వానించారు. 'జర్మనీ ఐక్యతను సుస్థిరం చేసే ప్రక్రియ మొత్తంగా శాంతియుతంగా సాగడం ప్రధానంగా ఆయన సాధించిన ప్రత్యేక విజయంగా భావించాలి.' అని వామపక్ష పార్లమెంటరీ గ్రూపు ట్విట్టర్‌లో వ్యాఖ్యానించింది. ఆయన రాజకీయ వారసత్వం ఎన్నటికీ నిలిచి వుంటుందని పేర్కొంది. కమ్యూనిస్టు పార్టీ చీఫ్‌గా 16ఏళ్ళు పాటు పనిచేశారు. పార్టీ ఇచ్చిన సదుపాయాలను కాదని, సాధారణమైన అపార్ట్‌మెంట్‌లోనే ఆయన జీవించడానికి ఇష్టపడ్డారు. 1999 నుండి 2004 వరకు ఆయన యురోపియన్ పార్లమెంట్ సభ్యుడిగా కూడా వున్నారు. అంతకుముందు 1994 వరకు యునైటెడ్ పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు.

పాక్‌లో నిరసనల హోరు

- నింగినంటుతున్న నిత్యావసరాల ధరలు
- సంక్షోభంతో సామాన్యుల వెతలు



ఇస్లామాబాద్ : ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్‌లో నిత్యావసరాల ధరలు అమాంతం పెరగడంతో.. అక్కడి ప్రజలు బతకడం కష్టమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారం రోజులుగా నిరసనలు పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారు. అనేక నగరాల్లో ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపడుతున్నారు. పాకిస్తాన్ ఆర్థిక మాంద్యం నుంచి పుంజుకోవడానికి రుణాలను తీసుకున్నా.. వాటిని తిరిగి చెల్లించలేక అవస్థలు పడుతోంది. దాదాపు ప్రపంచంలోనే రుణ ఎగవేతకు దగ్గరలో ఉన్న అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో పాకిస్తాన్ ఐదో దేశంగా నిలవనుందని కొన్ని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ద్రవ్యోల్బణం 48 ఏళ్ల గరిష్టానికి చేరింది. దీంతో అక్కడి ప్రజల జీవనం కష్టతరమౌతుంది. ఇక గతేడాది వరదల ప్రభావం అక్కడి ప్రజల పైనా, ఆర్థిక వ్యవస్థపైనా ఇప్పటికీ కొనసాగుతోంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు ఈ వారంలో పాక్ ప్రభుత్వం ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ నుండి 6.5 బిలియన్ డాలర్ల రుణం కోసం ప్రయత్నించినప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఆర్థికంగానూ, రాజకీయంగానే కాదు.. అక్కడ ఉగ్రవాదం కూడా పెచ్చరిల్లడం ఆ దేశాభివృద్ధికి పెను సమస్యగా దాపురించింది. ఇటీవల పెషావర్ నగరంలోని మసీదులో జరిగిన ఆత్మాహుతి దాడివల్ల దాదాపు 100 మందికిపైగా మృతి చెందారు.

ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో అక్కడి ప్రజల పరిస్థితులు ఎలా ఉన్నాయని తెలుసుకోవడానికి బ్లూమ్‌బర్గ్ అనే న్యూస్ ఛానెల్ పాకిస్తానీయులను పలకరించింది. ఈ ఛానెల్‌తో మొహమ్మద్ రషీద్ అనే ఓ రెస్టారెంట్ యజమాని మాట్లాడుతూ... 'పెరుగుతున్న ధరల ద్రవ్యోల్బణం వల్ల స్థానిక వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయి. ఈ శీతాకాలంలో తన రెస్టారెంట్‌లో సీ ఫుడ్స్ 50 శాతం మేర విక్రయాలు తగ్గాయి. ధరలు పెరగడం వల్ల మధ్యతరగతి కస్టమర్లు సీ ఫుడ్‌కి దూరంగా ఉంటున్నారు.' అని అన్నారు.

ఇక గ్యాస్ స్టేషన్ మేనేజర్ ఇర్ఫాన్ అలీ బ్లూమ్‌బర్గ్ ఛానెల్‌తో మాట్లాడుతూ.. 'ప్రభుత్వం గత నెలలో పెట్రోల్ ధర పెంచింది. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర 262గా ఉంది. దీంతో ప్రయాణీకులు.. తమ ప్రయాణాలను తగ్గించుకుంటున్నారు. లీటర్ పెట్రోల్ ధర రూ.200 ఉన్నప్పుడు 15 వేల లీటర్ల పెట్రోల్‌ని అమ్మాం. ఇప్పుడు రూ. 250కి పైగా ఉండడంతో రోజుకు 13 వేల లీటర్లే అమ్ముతున్నాము. ఒక్కోరోజు అంతకంటే తక్కువగా అమ్ముతున్నాము. ప్రస్తుతం పార్కో పాకిస్తాన్ లిమిటెడ్ పెట్రోల్ బంక్‌లు ఖాళీగా ఉంటున్నాయి' అని ఇర్ఫాన్ అలీ చెప్పుకొచ్చారు. చాలామంది పాకిస్తానీయులు రోజువారీ అవసరాల కోసం అప్పులు చేస్తున్నారు. ఫర్జానా అనే మహిళ తన ఇంటి అవసరాల కోసం ఐదు వేల రూపాయల్ని అప్పు చేయగా.. దాన్ని తీర్చలేక 16 ఏళ్ల తన కుమారుడిని చదువు మాన్పించి రెస్టారెంట్‌లో పనికి పంపిస్తున్నట్లు మీడియాతో చెప్పారు. తన దగ్గరున్న నగలన్నీ కూడా అమ్ముకున్నానని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఇక మహమ్మద్ రషీద్ అనే ఓ రైతు మీడియాతో మాట్లాడుతూ.. 'గత రెండేళ్లలో కూలీల రేట్లు బాగా పెరిగిపోయాయి. వ్యవసాయ ఖర్చులు భారీగా పెరిగాయి. వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు' అని అన్నారు.



కేరళలో యువ న్యాయవాదులకు భృతి

- నెలకు రూ.3 వేలు చొప్పున అందజేత

తిరువనంతపురం : కేరళలోని వామపక్ష ప్రభుత్వం మరో ప్రజానుకూల పథకాన్ని ప్రారంభించింది. యువ న్యాయవాదులకు నెలకు రూ.3 వేలు చొప్పున వేతన భృతి (స్టైఫండ్) అందజేసేందుకు ఉద్దేశించిన ప్రత్యేక పథకాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ శనివారం ఇక్కడ ప్రారంభించారు. రాష్ట్రంలోని రూ.లక్ష లోపు ఆదాయమున్న జూనియర్ లాయర్లకు నెలకు రూ.మూడు వేలు చొప్పున ఈ పథకం కింద అందజేస్తారు. మూడేళ్ల ప్రాక్టీస్ మించకుండా 30 ఏళ్ల లోపు వయస్సున్న యువ న్యాయవాదులు ఈ పథకానికి అర్హులు. కేరళ బార్ కౌన్సిల్, కేరళ న్యాయవాదుల సంక్షేమ నిధి ట్రస్టు కమిటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేరళ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఎస్ మణికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బార్ కౌన్సిల్ ఛైర్మన్ న్యాయవాది కెఎన్ అనిల్ కుమార్, రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పి రాజీవ్, రెవెన్యూ మంత్రి కె రాజన్, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది కె గోపాలకృష్ణ కురుప్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేధింపుల నుండి డొమెస్టిక్ వర్కర్స్‌కు రక్షణ కల్పించాలి

- ఎఐసిసిడిడబ్ల్యు డిమాండ్

న్యూఢిల్లీ : గుర్‌గావ్‌లోని ఒక ఇంట్లో పనిచేస్తున్న మహిళపై అమానవీయమైన రీతిలో వేధింపులకు, దూషణలకు పాల్పడుతున్న దంపతులపై కఠిన చర్య తీసుకోవాలని అఖిల భారత డొమెస్టిక్ వర్కర్స్ సమన్వయ కమిటీ (ఎఐసిసిడిడబ్ల్యు) పోలీసులను కోరింది. ఈ వేధింపులపై దర్యాప్తు జరిపి, ఈ ఇంట్లో ఆమెను పనికి నియమించిన సంస్థపై కూడా చర్యలు తీసుకోవాలని కోరింది. బాధిత మైనర్ అని వార్తలు వస్తున్నాయని, అదే గనుక నిజమైతే పనిలో పెట్టుకున్న దంపతులు, పనిలో పెట్టిన సంస్థ ఇరు పక్షాలను బాల కార్మిక రక్షణ, నియంత్రణ చట్టం కింద విచారించాలని కోరింది. 14ఏళ్ళ లోపు వారు ఏ రంగంలో పని చేయకుండా నిషేధించాలని ఆ చట్టం కోరుతోంది. అలాగే బాధితురాలికి తగిన వైద్య చికిత్సనందించి, నష్టపరిహారం అందించాలని కమిటీ కోరింది. ఎన్‌సిఆర్ రీజియన్‌లో ఇలా పనిమనుష్యులను వేధిస్తున్న కేసులు అనేకం వెలుగులోకి వచ్చినప్పటికీ, అటు కార్మిక శాఖ గానీ ఇటు పోలీసులు గానీ వీటిపై స్పందించి చర్యలు తీసుకున్న దాఖలా కనిపించడం లేదని ఎఐసిసిడిడబ్ల్యు పేర్కొంది. ప్రఖ్యాతి చెందిన సంస్థల్లో పనిచేస్తూ, మంచి ఆకర్షణీయమైన వేతనాలు సంపాదించుకుంటున్న వారు తమ ఇళ్లలో పనిచేసే వారిని కనీసం మనుష్యులుగా కూడా చూడకపోవడం విచారకరమని పేర్కొంది. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు ఈ విషయంలో మౌనం పాటించడం మరింత దిగ్భ్రాంతికరమని కమిటీ పేర్కొంది. డొమెస్టిక్ వర్కర్స్ పని పరిస్థితులను క్రమబద్ధీకరించి, వారికి ఇలాంటి వేధింపుల నుండి రక్షణ కల్పించాల్సిన తక్షణావశ్యకత వుందని పేర్కొంది. ఇటువంటి కేసులు ఎక్కడ జరిగినా అప్రమత్తంగా వుండి వెంటనే యూనియన్‌కు, స్థానిక పోలీసులకు తెలియచేయాలని కమిటీ కోరింది.

ఉమ్మడి మీడియా కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

- నాజ్, డియుజె డిమాండ్

న్యూఢిల్లీ : ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు ఉమ్మడి మీడియా కౌన్సిల్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని, ఒకే వ్యక్తి లేదా సంస్థ పలు మీడియా యాజమాన్యాలను (క్రాస్ మీడియా ఓనర్‌షిప్) కలిగి వుండడంపై బాధ్యతాయుతమైన తనిఖీలు వుండాలని, జాతీయ వార్తాపత్రికలు, ఫీచర్ సంస్థల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా జాతీయ వార్తలు, ఫీచర్ సంస్థల అభివృద్ధికి దోహదపడేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (నాజ్), ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్ (డియుజె)లు కోరాయి. ఈ మేరకు పార్లమెంట్ సభ్యులు, రాజకీయ పార్టీల నేతలకు బహిరంగ లేఖ రాసినట్లు నాజ్ అధ్యక్షులు ఎస్.కె.పాండే, డియుజె ప్రధాన కార్యదర్శి సుజాత మదోక్, నాజ్ సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య, ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మొదటి, రెండవ ప్రెస్ కమిషన్ల తరహాలోనే మొత్తంగా మీడియాపై అధ్యయనం చేయడానికి మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, సార్వజనీకరణ ప్రారంభమైన తరుణంలో, పైగా మీడియా సంస్థల్లో జర్నలిస్టులు, జర్నలిస్టేతర సిబ్బంది దయనీయమైన పరిస్థితులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో పెను మార్పులు తలెత్తుతున్నందున పరిష్కార చర్యలు కూడా సిఫార్సు చేయాలని వారు కోరారు. 2014లో సుప్రీం రూలింగ్‌కు అనుగుణంగా వేతన బోర్డు సిఫార్సులను అమలు చేయాలని, సక్రమ రిస్క్ ఇన్సూరెన్స్ కవరేజ్ వుండాలని, పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని కోరారు.

నామినేషన్ ఉపసంహరించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి

కోహిమా : త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. కాగా, నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది. మార్చి 2వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా అకులుటో స్థానం నుంచి బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఖేకషే సుమీ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజైన శుక్రవారం.. ఆఖరి క్షణాల్లో తాను పోటీనుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం, తన నామినేషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు. దీంతో బిజెపి అభ్యర్థి కఝెటో కినిమీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బరిలో ఉన్న ఇద్దరిలో ఒకరు తప్పుకోవడంతో 68 ఏండ్ల కినిమీ యునానిమస్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. కినిమీ ఎమ్మెల్యేగా ఎన్నికవడం వరుసగా ఇది రెండోసారి. కాగా, నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది. మార్చి 2వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది.

టర్కీ, సిరియా భూకంపంలో 24 వేలకు చేరిన మరణాలు

అంకారా : టర్కీ, సిరియాల్లో సంభవించిన వరుస భూకంపాలతో వేలాదిమంది మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ భూకంపాల వల్ల 24 వేల మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. టర్కీలో 20,665 మంది మృతి చెందారని విపత్తు నిర్వహణా అధికారులు శనివారం వెల్లడించారు. ఇక సిరియాలో 3,500 మందికిపైగా మృతి చెందారు. ఇక దక్షిణ టర్కీలోని భూకంప ప్రాంతం నుండి 93 వేల మందిని సహాయక శిబిరాలకు తరలించినట్లు రెస్క్యూ అధికారులు తెలిపారు. ఈ సహాయక చర్యల్లో దాదాపు 16 వేల మందికిపైగా సిబ్బంది పాల్గొన్నారు. ఈ భూకంపం వల్ల రెండు దేశాల్లో 87 వేల మందికిపైగా ప్రజలకు ఆహారాన్ని అందజేయాల్సిన అవసరముందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఆర్మేనియా, టర్కీల దేశాల మధ్య సరిహద్దు 30 ఏళ్ల తర్వాత తెరవబడింది. టర్కీలోని ఇగ్దిర్ ప్రావిన్స్‌లోని అలికాన్ సరిహద్దు గుండా ఐదు ట్రక్కుల మనుషులను పంపినట్లు అర్మేనియా అధికార పక్షనేత గారో పైలాన్ ట్వీట్ చేశారు.

122 గంటల తర్వాత సజీవంగా ఇద్దరు మహిళలు

కాగా, సోమవారం నుంచి అవిశ్రాంతంగా రెస్క్యూసిబ్బంది శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికితీస్తున్నారు. మృతదేహాల నుంచి గాఢమైన వాసన వెదజల్లుతున్నా.. శిథిలాల కింద బతికున్నవారి కోసం రెస్క్యూ సిబ్బంది వెతుకుతున్నారని మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇక శనివారం కొనసాగుతున్న సహాయక చర్యల్లో రెస్క్యూ సిబ్బంది శిథిలాల కింద ఉన్న ఇద్దరు మహిళలను బయటకు తీశారు. దాదాపు 122 గంటల తర్వాత వారిని శిథిలాల నుంచి సజీవంగా బయటకు తీసినట్లు రెస్క్యూ అధికారులు వెల్లడించారు. రెస్క్యూ సిబ్బంది రక్షించబడిన మహిళల్లో మెనెక్సే తబాక్ (70). ఈమె కహ్రామన్మరాస్ ప్రావిన్స్‌కి చెందిన వారు. ఈమెను వెంటనే చికిత్సనిమిత్తం రెస్క్యూసిబ్బంది ఆసుపత్రికి తరలించారు. ఇక రెండో మహిళ మసల్లా సిసెక్ (55). టర్కీలోని దియార్‌బాకిర్ నగరంలోని అతిపెద్ద భవనం కూలిపోయిన శిథిలాల నుంచి ఈమెను బయటకు తీసినట్లు మీడియా వర్గాలు తెలిపాయి.

ఆదర్శ విద్యార్థి



సంవత్సరం మధ్యలో ఆనంద్ ఏడవ తరగతిలో చేరాడు. అందరికంటే చిన్నవాడని అందరూ 'తమ్ముడూ...!' అనేవారు. 'ఒరేయ్! నువ్వింత చిన్నగా ఉన్నావు. మాతో పోటీగా పరీక్షలు రాసి నెగ్గగలవా? అని గేలి చేసేవారు. గెలిస్తే నీకు మంచి బహుమతి ఇస్తాం' అని సవాలు చేసేవారు. ఆనంద్ మాత్రం ఎవరినీ ఏమనకుండా, అందరితో చక్కగా మాట్లాడేవాడు.

పరీక్షలు రానే వచ్చాయి. 'ఏరా పందెం గుర్తుందా' అని తోటివారు ఎగతాళి చేస్తున్నా పట్టించుకోకుండా ఆనంద్ పరీక్షలు రాశాడు. పరీక్ష ఫలితాల్లో అగ్రగామిగా నిలిచాడు. పిల్లలంతా సిగ్గుతో తలొంచుకున్నారు. బడి అయ్యాక 'తమ్ముడూ! నువ్వు ఏడాది మధ్యలో చేరావు కదా! అయినా మొదటి స్థానంలో ఎలా వచ్చావు' అని ప్రశ్నించారు. దానికి ఆనంద్ 'అన్నయ్యలు, నేను కష్టపడి కాదు, ఇష్టపడి చదువుతాను. అలాగే నన్ను ఎగతాళి చేసినా పట్టించుకోను' అని చెప్పాడు. ఆ రోజు నుంచి ఆనంద్‌ను ఆదర్శంగా తీసుకుని మిగతా విద్యార్థులంతా ఎంతో ఇష్టంగా చదివేవారు. మంచి ర్యాంకులు సాధించేవారు. వాళ్ల ఊరికి, పాఠశాలకు, తల్లిదండ్రులకూ మంచి పేరు తెచ్చిపెట్టారు.

- మార్లపూడి ఆనందకుమార్
99490358767



తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ



- పలగాని ఆవిష్కర్,
5వ తరగతి,
జోసెఫ్ హైస్కూలు, పెదకాకాని,
గుంటూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



శ్యాం కుమార్

మ్యాజిక్ మాస్టారు

ఈ మాస్టారు తరగతిగదిలో దేశ భవిష్యత్తు నిర్మితమవుతుందని గట్టిగా నమ్ముతారు. మూఢనమ్మకాలలో కొట్టుకుపోకుండా సమాజాన్ని చైతన్య పరిచేందుకు విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అలవరుస్తున్నారు. తన ఇంద్రజాల విద్యతో పిల్లలను, సమాజాన్ని చైతన్య బాట నడిపిస్తున్న ఈయన పేరు చింతా శ్యాం కుమార్. రాజమండ్రి ర్యాలీకి చెందిన ఈ లెక్కల మాస్టారు 'శ్యాం జాదుగర్'గా సుపరిచితులు. మ్యాజిక్ షోలతో దేశవిదేశాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న శ్యాం ప్రస్థానానికి తొలి బీజం ఆత్రేయపురం మండలం, అంకం పాలెం గ్రామం, పాటి చెరువు ప్రాథమిక పాఠశాల నుండి ప్రారంభమైంది.

నలభైనాలుగు మంది విద్యార్థులున్న ఆ ప్రాథమిక పాఠశాలకు 2004లో శ్యాం సెకండరీ గ్రేడ్ టీచర్‌గా వచ్చారు. ఒక రోజు ఆ బడిలో రెండోతరగతి చదువుతున్న ఓ పాప వాళ్ల నాన్న చనిపోయాడు. ఆ తరువాత కొన్ని రోజులకు ఆ పాప స్కూలుకు వచ్చింది. అయితే ఆ రోజు నుండి ఆ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకంలో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. రోజుకు కేవలం నలుగురే భోజనం చేస్తున్నారు. శ్యామ్‌కు విషయం అర్థం కాలేదు. పిల్లలు ఏవేవో సాకులు చెబుతున్నారు కాని ఆయనకు ఏదో అనుమానంగా ఉంది. ఆరా తీశారు. అప్పుడు పిల్లలు అసలు విషయం చెప్పారు. 'ఆ పాప తండ్రి హెచ్ఐవి సోకి చనిపోయాడు. కాబట్టి అతని కూతురుతో కలిసి కూర్చొని తింటే తమకూ వ్యాధి వస్తుందని తమ తల్లిదండ్రులు వద్దన్నార'ని చెప్పారు. ఆ సమాధానంతో శ్యాం మాస్టారు విస్తుబోయారు. 'పిల్లల్లోనూ.. పెద్దల్లోనూ హెచ్ఐవి వైరస్ భయం పోగొట్టాలి. మామూలుగా చెబితే వాళ్లకు ఒకపట్టాన అర్థం కాదు.. మరి ఏం చేయాలి? అని బాగా ఆలోచించాను. నాకొచ్చిన కళ మ్యాజిక్. అయితే నేను మ్యాజిక్ చేస్తానని ఎవరికీ తెలియదు. నేనెప్పుడూ ఎవరిముందూ చేయలేదు. కాని ఆ కళ ద్వారానే ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, మూఢనమ్మకాలను పారద్రోలాలని ఆ రోజే గట్టిగా నిశ్చయించుకున్నాను' అంటున్న శ్యాం మాస్టారు క్లాసు రూంలో పిల్లలకు, బడి బయట పెద్దలకు మ్యాజిక్ షోల ద్వారా హెచ్ఐవిపై అవగాహన కల్పించారు. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా అనేక ప్రదర్శనలు చేశారు.

ఇంద్రజాల విద్య ఇలా అబ్బింది..

శ్యాంకుమార్ బాల్యమంతా పేదరికంలోనే సాగింది. చదువులో చాలా చురుకుగా ఉండేవారు. కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఎంతో ఉత్సాహపడేవారు. 'బాగా చిన్నప్పుడు ఓ సారి మా వీధిలోకి గారడి చేసే వారు వచ్చారు. వాళ్ల గారడీ విద్య నన్ను బాగా ఆకర్షించింది. కన్నార్పకుండా చూసినా వాళ్లు చేస్తున్న మాయ అర్థమవ్వలేదు. అది తెలుసుకోవాలని వారితోపాటు ఊరి చివరకు వెళ్లిపోయి, దారి తప్పి అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటికి చేరాను. అమ్మానాన్న చాలా కంగారుపడి బాగా కొట్టారు. మళ్లీ అటువైపు చూడొద్దని హెచ్చరించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా గారడీవిద్య నేర్చుకోవాలన్న కోరిక మాత్రం అలాగే ఉండిపోయింది. దీంతో చదువుకుంటూనే అమ్మానాన్నకు తెలియకుండా ఎక్కడ మ్యాజిక్ షో ఉంటే అక్కడికి వెళ్లిపోయేవాడ్ని. ఢిల్లీ, కలకత్తాలో మ్యాజిక్ వర్క్ షాపులకు హాజరయ్యేవాడిని. ఇదంతా ఎవరికీ తెలియదు' అంటున్న శ్యాం మాస్టారును పాఠశాలలో జరిగిన ఆ సంఘటన మళ్లీ ఆ కళవైపు మళ్లించింది.

దేశవిదేశాల్లో ప్రదర్శనలు..

ప్రభుత్వ స్కూల్లో ఉపాధ్యాయుడిగా ప్రస్థానం మొదలుపెట్టిన శ్యాం మ్యాజిక్ షోల ద్వారా సమాజాన్ని చైతన్యం చేయడం ఎంతోమందిని ఆకర్షించింది. మొదట చిన్న చిన్న కార్యక్రమాలకు ఆహ్వానిస్తూ ప్రదర్శనలు ఇప్పించేవారు. కొత్త కొత్త ట్రిక్కులతో గతంలో ఎప్పుడూ చూడని మ్యాజిక్‌లతో ప్రజలను ఉత్సాహపరుస్తున్న శ్యాం ప్రతిభ చాలా స్వల్పకాలంలోనే దేశ నలుమూలలకు వ్యాపించింది. హెచ్ఐవిపై శ్యాం చేస్తున్న అవగాహనా కార్యక్రమాలను మెచ్చి హైద్రాబాద్‌లో యునిసెఫ్ సంస్థ అతనితో ఓ ప్రదర్శన ఇప్పించింది. అలా తొలిసారి రాష్ట్రం దాటిన ఆయన ఆ తరువాత తమిళనాడు, కలకత్తా, ఢిల్లీ, కర్నాటక వంటి రాష్ట్రాల్లో మలేషియా, శ్రీలంక, కువైట్, వియత్నాం వంటి దేశాలలో ప్రదర్శనలిచ్చారు. అనేక మంది మ్యుజీషియన్లకు కొత్త ట్రిక్కులు నేర్పుతున్నారు. ఇప్పటివరకు మొత్తం 6 వేల ప్రదర్శనలిచ్చిన శ్యాం మాస్టారుకు వందలాది సంస్థలు ఉత్తమ ఇంద్రజాలకుడి అవార్డుతో సత్కరించాయి. ఇంకా యునిసెఫ్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు ఎన్నో ప్రశంశలు, అభినందనలు ఆ జాబితాలో ఉన్నాయి.

స్కూలు డ్రాపౌట్లను బడి బాట పట్టించడం..

డ్రాపౌట్లను స్కూలుకు రప్పించడమే కాక, ఆ పిల్లల్లో ఉన్న కళను వెలికితీసి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయడంలో కూడా శ్యాం మాస్టారు ముందుంటున్నారు. చదువంటే భయమున్న పిల్లలనే కాక, బుద్ధి మాంద్యంతో స్కూలుకు రాలేని పిల్లలను కూడా మ్యాజిక్ షోలతో ఆకర్షించి బడి బాట పట్టిస్తున్నారు. ఆ పిల్లలకు శిక్షణ ఇచ్చి వారితో షోలు చేయిస్తున్నారు. అలా ఎంతోమంది పిల్లలను తీర్చిదిద్దారు.

నా జీవితాన్నే మార్చేశారు..

'నేను అల్లరిచిల్లరగా తిరుగుతూ ఉండేవాడిని. మాస్టారు పాఠం చెప్పేటప్పుడు, స్కూలుకు వచ్చేటప్పుడు, ఎప్పుడు పడితే అప్పుడు అదేపనిగా విజిల్స్ వేసేవాడిని. అందరూ తిట్టేవారు. స్కూలుకెళితే మాస్టారు కొడతారని భయమేసి బడికెళ్లడం మానేశాను. కాని శ్యాం మాస్టారు ఒకరోజు మా ఇంటికి వచ్చి నన్ను స్కూలుకు తీసుకెళ్లారు. అక్కడ నాతో ఆగకుండా విజిల్స్ వేయించారు. స్కూలు పిల్లలతో చప్పట్లు కొట్టించారు. వారందరి ముందు నా గురించి చాలా గొప్పగా చెప్పారు. నాకేమీ అర్థం కాలేదు. ఆ తరువాత తక్కువ సమయంలో వందల విజిల్స్ ఎలా వేయాలో శిక్షణ ఇప్పించారు. నాతో ప్రదర్శనలిప్పించారు. అది నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. నేను పై చదువులు చదువుకునేందుకు బ్యాంకు లోను రావడానికి కూడా ఆ ప్రతిభ ఉపయోగపడింది' అంటున్నాడు మాస్టారు పూర్వ విద్యార్థి దుర్గాప్రసాద్.




దుర్గా ప్రసాద్

ఉపాధ్యాయుడిగా.. ఇంద్రజాలికుడిగా.. సమాజసేవకుడిగా జీవిస్తున్న శ్యాం మాస్టారిని ఈ మూడింటిలో మీకు బాగా ఇష్టమైన రంగమేదంటే.. 'ఉపాధ్యాయ వృత్తి నాకు ఎంతో ఇష్టమైనది. ఆ వృత్తే నా జీవితాన్ని రెండు విభిన్న మార్గాల్లో నడిపించింది. ముఖ్యంగా నాలో దాగున్న కళను వెలికితీసి ఎంతో పేరు ప్రఖ్యాతులు వచ్చేలా చేసింది' అంటున్నారు.

- జ్యోతిర్మయి

కుటుంబ సభ్యులతో



మ్యాజిక్ ఫ్యామిలీ..

భార్యా, పిల్లలు ప్రోత్సాహమివ్వడమే కాదు, శ్యాంతో పాటు మ్యాజిక్ షోలలో కూడా పాల్గొంటోంది. దీంతో ఊరి వారందరూ ఆ కుటుంబాన్ని 'మ్యాజిక్ ఫ్యామిలీ' అని పిలుస్తారు. 'మూడేళ్ల వయసు నుండీ పిల్లలను ఇందులో భాగస్వామ్యం చేశాను. మా అబ్బాయి మోహిత్ 3 వేల ప్రదర్శనలిచ్చి దేశంలోనే యువ ఇంద్రజాలికుడిగా అవార్డు అందుకున్నాడు. నా కూతురి కొడుకు కూడా ఏడాదిన్నర వయసులోనే మ్యాజిక్ షో చేసి అవార్డు అందుకున్నాడు. నా భార్య అన్నపూర్ణ మ్యాజిక్ షోలతో పాటు 'భారత్ టాలెంట్ అసోసియేషన్' పేరుతో విభిన్న కళల్లో ప్రావీణ్యం ఉన్నవారిని ప్రోత్సహిస్తూ వస్తోంది. కుటుంబమంతా కలసి ఎన్నో మ్యాజిక్ షోలు చేశాం' అని చెబుతున్నారు శ్యాం మాస్టారు.



సేవా మార్గంలోనూ..

నాకు ఆకలి విలువ తెలుసు. అందుకే నా సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు వినియోగిస్తున్నాను. కరోనాతో మా ఊళ్లో ఉన్న సత్రం మూతబడింది. వారు ఆకలితో పస్తులు ఉండడం చూడలేక మొదట వారికి వండిపెట్టాం. ఆ తరువాత ఎంతోమందికి భోజన ప్యాకెట్లు సరఫరా చేశాం. నా కుటుంబం చాలా సహకరించింది. మా అబ్బాయి, నేను కలిసి సోషల్‌మీడియా ద్వారా కరోనా భయం పోగొట్టేందుకు కౌన్సిలింగ్ సెషన్లు నిర్వహించేవాళ్లం. మ్యాజిక్ షోలు చేశాం. అప్పుడు మొదలైన సేవాప్రస్థానం ఇప్పటికీ కొనసాగిస్తున్నాను.

- శ్యాం కుమార్

స్ట్రీల్ సర్క్యూట్‌లోకి దూసుకెళ్లిన ఇ-కార్

మొదటి స్థానంలో జా ఎరిక్ వా ● హైదరాబాద్‌లో ముగిసిన ఫార్ములా ఇ-కార్ రేస్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత మోటార్ స్పోర్ట్స్‌లో నూతన అధ్యాయానికి హైదరాబాద్ వేదికైంది. ఫార్ములా వన్ తర్వాత ఎక్కువ ఆదరణ పొందిన ఫార్ములా ఇ - కార్ రేస్ శనివారం అట్టహాసంగా ముగిసింది. నెక్లెస్ రోడ్ - సచివాలయం రూట్‌లో ఏర్పాటు చేసిన 2.8 కిలోమీటర్ల స్ట్రీట్ సర్క్యూట్‌లో జాగ్వార్, నిస్సాన్, కప్రా, అవలాంచ్, మహీంద్రా కార్లు దుమ్ము రేపాయి. 25 పాయింట్లతో జా ఎరిక్ వా మొదటి స్థానంలో నిలిచాడు. నిక్ క్యాసిడి 18 పాయింట్లతో రెండో స్థానం, 15 పాయింట్లతో ఆంటోనియో ద కోస్తా మూడో స్థానంలో నిలిచారు. 11 ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలకు చెందిన 22 మంది రేసర్లు ఈ పోటీలో పాల్గొన్నారు. విజేతకు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ట్రోఫీ అందించారు. ఫార్ములా ఇ -కార్ రేస్‌ను వీక్షించేందుకు హైదరాబాదీలు భారీగా తరలివచ్చారు. రయ్‌మంటూ దూసు కొస్తున్న కార్లను చూసి ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. ఆడియన్స్ గ్యాలరీలో పలువురు సినీ, రాజకీయ ప్రము ఖులు, క్రికెటర్లు సందడి చేశారు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్, శిఖర్ ధావన్, దీపక్ హుడా, యజ్ఞేంద్ర చాహల్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, తెలంగాణ మంత్రి కెటిఆర్, ఎంపిలు సంతోష్, రామ్మోహన్ నాయుడు, గల్లా జయదేవ్, నటుడు రామ్‌చరణ్ తదితరులు హాజరయ్యారు.

మూడురోజుల్లోనే ముగించేశారు

- అశ్విన్, జడేజా దెబ్బకు ఆసీస్ కుదేల్..
- తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 132పరుగుల తేడాతో టీమిండియా గెలుపు





ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జడేజా

నాగ్‌పూర్: టీమిండియా స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా స్పిన్ మాయాజాలానికి ఆస్ట్రేలియా బ్యాటర్స్ రెండో ఇన్నింగ్స్ చేతులెత్తేశారు. దీంతో భారతజట్టు తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 132పరుగుల తేడాతో గెలిచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నాలుగు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యతలో నిలిచింది. ఆస్ట్రేలియా జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 91పరుగులకే ఆలౌటై.. భారత్ చేతిలో ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 7వికెట్ల నష్టానికి 321పరుగులతో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారతజట్టు మరో 79పరుగులు జతచేసి మిగిలిన మూడు వికెట్లను కోల్పోయింది. అక్షర్ పటేల్(84) అర్ధసెంచరీతో మెరిసాడు. చివరి వికెట్‌గా అక్షర్ పటేల్ ఔట్ కావడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 400పరుగులకు ఆలౌటైంది. దీంతో భారతజట్టుకు 223 పరుగుల ఆధిక్యత సంపాదించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా జట్టు భారత స్పిన్నర్ల ధాటికి 91 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో (3/42)తో ఆకట్టుకున్న అశ్విన్.. రెండో ఇన్నింగ్స్(5/37) స్పిన్ మాయాజాలంతో ఆసీస్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో సత్తాచాటిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో భారత స్పిన్నర్లు 16 వికెట్లు పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రవీంద్ర జడేజాకు లభించింది.

స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 177ఆలౌట్, ఇండియా తొలి ఇన్నింగ్స్: 400ఆలౌట్

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖవాజా (సి)కోహ్లి (బి)అశ్విన్ 5, వార్నర్ (ఎల్‌బి) అశ్విన్ 10, లబూషేన్ (ఎల్‌బి)అశ్విన్ 17, స్మిత్ (నాటౌట్) 25, రెన్‌షా (ఎల్‌బి) అశ్విన్ 2, హ్యాండ్‌కోంబ్ (ఎల్‌బి) అశ్విన్ 6, క్యారీ (ఎల్‌బి) 10, కమిన్స్ ((సి) శ్రీకర్ భరత్ (బి)జడేజా 1, మర్ఫీ (సి)రోహిత్ (బి)అక్షర్ 2, లియాన్ (బి)షమీ 2, బోలండ్ (ఎల్‌బి)షమీ 0, అదనం 5. (32.3ఓవర్లలో ఆలౌట్) 91పరుగులు. **వికెట్ల పతనం:** 1/7, 2/26, 3/34, 4/42, 552, 6/64, 7/67, 8/75, 9/88, 10/91 **బౌలింగ్:** షమీ 4.3-1-13-2, అశ్విన్ 12-3-37-5, సిరాజ్ 1-1-0-0, జడేజా 12-3-34-2, అక్షర్ 3-0-5-1.



భోళాశంకర్ సెట్‌లో రాఘవేంద్రుడు

చిరంజీవి ప్రస్తుతం 'భోళా శంకర్' పూర్తి చేస్తున్నాడు. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా తమిళంలో సూపర్ హిట్టయిన 'వేదాలం'కు రీమేక్‌గా తెరకెక్కుతోంది. ప్రస్తుతం చిత్రయూనిట్ కోల్‌కత్తా నేపథ్యంలో సాగే ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. కాగా ఈ సినిమా షూటింగ్ జరుగుతున్న సెట్స్‌కు దర్శకుడు రాఘవేంద్రరావు వెళ్లారు. 'నేను చూడాలని వుంది సెట్స్‌కు కూడా వెళ్ళాను. అప్పుడు 'రామ్మా చిలకమ్మా' సాంగ్ తీస్తున్నారు. అది కూడా కోల్‌కతా నేపథ్యంలో సాగింది. ఇప్పుడు ఈ సాంగ్ షూటింగ్ చూస్తుంటే ఆ పాట జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయి. ఈ పాట బ్లాక్‌బస్టర్ సాధిస్తుందని' అని రాఘవేంద్రరావు అన్నారు. చిరంజీవి చెల్లెలిగా కీర్తి సురేష్ నటిస్తోంది. చిరుకు జోడీగా తమన్నా నటిస్తోంది. ఏకే ఎంటర్‌టైనమెంట్స్, క్రియేటీవ్ కమర్షియల్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. వేసవిలో రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

'సూర్య 42'లో నటించాలనుందా..!

దర్శకుడు శివతో సూర్య చేస్తున్న 42వ సినిమాలో నటించే అవకాశాన్ని కొంతమందికి కల్పించేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. 25 నుంచి 55 ఏళ్ల మధ్యలో దేహ దారుఢ్యం కలిగి ఉన్నవారు, మంచి గడ్డం కలిగి ఉన్నవారు ఈ సినిమాలో నటించే ఛాన్స్ ఉందని ఆహ్వానించారు. ప్రస్తుతం వారు ఎలా ఉన్నారో ఫొటోగ్రాఫ్‌లను తమ మెయిల్‌కి పంపాలని సూచించారు. దీనికి సంబంధించిన ఓ పోస్టర్‌ను మేకర్స్ విడుదలచేశారు.

అభిమానికి బన్నీ ఆర్థికసాయం



అల్లు అర్జున్ తన అభిమాని పట్ల గొప్ప మనసు చాటుకున్నాడు. అర్జున్ కుమార్ అనే ఓ వీరాభిమాని తండ్రి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారని తెలుసుకొని ఆయనకు వైద్యం చేయించాడు. సర్జరీకి దాదాపు రూ.2 లక్షల కావాల్సి ఉండగా అర్జున్‌కుమార్ తండ్రికి అంత ఆర్థిక స్థోమత లేకపోయింది. దాంతో బన్నీ అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని షేర్ చేశారు. ఈ విషయం బన్నీ దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాడు. దీనిపై పలువురు నెట్‌జన్లు బన్నీను ప్రశంసిస్తున్నారు.

సెన్సార్ పూర్తి చేసుకున్న 'వినరో భాగ్యము విష్ణు కథ'



కిరణ్ అబ్బవరం, కశ్మీరా పరదేశి హీరో హీరోయిన్లుగా రాబోతున్న 'వినరో భాగ్యము విష్ణు కథ' చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. ఫిబ్రవరి 18న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్లలో రిలీజ్ కానుంది. నూతన దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మించారు. ఫిబ్రవరి 12న తిరుపతిలో ఆడియో లాంచ్ కానుంది.

అర్పిత్ డబుల్ సెంచరీ

సౌరాష్ట్రకు ఆధిక్యత.. రంజీట్రోఫీ సెమీఫైనల్స్



అర్పిత్ (202 పరుగులు)

బెంగళూరు: కర్ణాటకతో జరుగుతున్న రంజీట్రోఫీ సెమీఫైనల్లో సౌరాష్ట్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌరాష్ట్ర జట్టు 527 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ అర్పిత్ వసవాడ(202)డబుల్ సెంచరీకి తోడు చిరాగ్ జానీ(72) అర్ధసెంచరీతో రాణించారు. దీంతో ఆ జట్టుకు 120పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్ణాటకను కెప్టెన్ మయాంక్ అగర్వాల్(55) అర్ధసెంచరీతో రాణించాడు. దీంతో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి కర్ణాటక జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 4వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసి కేవలం 3 పరుగుల ఆధిక్యంలో ఉంది. నికిన్ జోస్(54) క్రీజ్‌లో ఉన్నారు. కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 407పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

మరో సెమీఫైనల్లో బెంగాల్ జట్టు మధ్యప్రదేశ్‌పై ఆధిక్యతను సంపాదించింది. నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి బెంగాల్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 9వికెట్లు నష్టపోయి 279 పరుగులు చేయడంతో 547 పరుగుల ఆధిక్యత లభించింది. బెంగాల్ రెండో ఇన్నింగ్స్‌లో 279/9 స్కోర్ వద్ద ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తుంది. తొలి ఇన్నింగ్స్‌లో బెంగాల్ 438 పరుగులకు ఆలౌట్ కాగా.. మధ్యప్రదేశ్ 170 పరుగులకే పరిమితమైన సంగతి తెలిసిందే. ఆఖరి రోజు ఫలితం రాని పక్షంలో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత ఆధారంగా ఫైనల్ బెర్త్‌లు ఖరారు కానున్నాయి.

ఇంగ్లండ్, శ్రీలంక బోణి

ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్



పార్ల్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్, శ్రీలంక జట్లు శుభారంభం చేశాయి. శనివారం జరిగిన గ్రూప్-2 తొలి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ అమ్మాయిలు 7వికెట్ల తేడాతో వెస్టిండీస్ అమ్మాయిలపై గెలుపొందింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్లు నష్టపోయి 135పరుగులు చేసింది. కెప్టెన్ మాథ్యూస్(42), క్యాంప్‌బెల్లె(34) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఎక్లేస్టోన్‌కు మూడు, బ్రంట్, గ్లెన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో ఇంగ్లండ్ జట్టు 14.3ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 138పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ డంక్లే(34), స్కీవర్(40), కెప్టెన్ హీథర్ నైట్(32) బ్యాటింగ్‌లో రాణించారు.

గ్రూప్-1లో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక మహిళల జట్టు 3పరుగుల తేడాతో ఆతిథ్య దక్షిణాఫ్రికాపై సంచలన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 129పరుగులు చేయగా.. ఛేదనలో దక్షిణాఫ్రికా మహిళలజట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 9 వికెట్లు కోల్పోయి 126పరుగులే చేయగల్గింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆటపట్టుకు లభించింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు..
భారత్ × పాకిస్తాన్ (సాయంత్రం 6.30గం॥లకు)
బంగ్లాదేశ్ × శ్రీలంక (రాత్రి 10.30గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68